నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

కేసీఆర్ ప్రభుత్వానికి ఆడబిడ్డల దీవెనలు ఉండాలి : మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్, మార్చి 6: సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి ఆడబిడ్డల దీవెనలు ఉండాలని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీ రాంలీలా మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ కవిత, మంత్రులు గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మొదట ఎల్ఎండీ కాలనీలోని అమరవీరుల స్తూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఎమ్మెల్యే రసమయిని రాబోయే ఎన్నికల్లో మరోసారి గెలిపించుకోవాలన్నారు.

తెలంగాణ ఆడబిడ్డ కవితక్కకు బంగారు భవిష్యత్తు ఉండాలన్నారు. ఆడబిడ్డల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. నిరుపేదేంటి ఆడబిడ్డల వివాహాల కోసం అయిన వారే పట్టించుకోని రోజులు వివాహం చేసేందుకు భూములను కుదువ పెట్టి అప్పులు చేసి పెళ్లి చేసిన రోజులు ఉండేవని గుర్తు చేశారు. చివరకు చేసిన అప్పులు చెల్లించలేక భూములను అమ్ముకున్న దుస్థితి ఉండేదని గుర్తు చేశారు. కానీ, నిరుపేదింటి ఆడబిడ్డ వివాహం కోసం సీఎం కేసీఆర్ మేనమామగా కల్యాణలక్ష్మి పథకం పేరుతో రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తున్నారన్నారు.

హైదరాబాద్ మంగళవారం 7-3-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 172 పేజీలు:6 వెల: రూ.1/-

షీ-టీమ్ ఆధ్వర్యంలో 2 -కె, 5 -కె రన్

హైదరాబాద్, మార్చి 6 :: ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణా పోలీస్ షీ- టీమ్స్, హైదరాబాద్ సిటీ పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రన్ లను ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ప్రారంభించగా, ప్రత్యేక ఆహ్వానితులుగా డీజీపీ అంజనీ కుమార్, సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, మహిళా భద్రతా విభాగం అడిషనల్ డీజీ షికా గోయల్ లు హాజరయ్యారు. మహిళా భద్రతా, షీ-టీమ్ లపై చైతన్యం తదితర అంశాలపై చైతనానికి ఉద్దేశించి 2 -కె , 5 -కె రన్ లను సిటీ పోలీస్ ఆధ్వర్యంలో నేడు ఉదయం నెక్లెస్ రోడ్లో నిర్వహించింది. ఈ రన్ లకు నగరంలోని యువతీ, యువకులు పెద్ద సంఖ్యలో హాజరు కాగా, మహిళా పోలీసులు, పోలీసు అధికారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

8 న రాజకీయ పార్టీల తో మహిళ సమ్మేళన సదస్సు

హైదరాబాద్ మార్చ్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 8న మేడ్చల్ జిల్లా కీసర మండలం కుందన్ బాగ్ లో గల దివ్యాస్గుల కాలనీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు పార్టీ జాతీయ కార్యనిర్వాక అధ్యక్షురాలు శివలెంకల నాగ యుదయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఎనిమిదవ తేదీ ఉదయం 10 గంటలకు వివిధ రాజకీయ పార్టీల తో మహిళ సమ్మేళన సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్ హాజరవుతున్నట్లు ఆమె తెలిపారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాకే వైభవంగా పండుగలు.. మంత్రి తలసాని

హైదరాబాద్, మార్చి 6:తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పండుగలు, ఉత్సవాలు ఎంతో వైభవంగా నిర్వహించబడుతున్నాయని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శ్రీరామనవమి రోజున భద్రాచలంలోని శ్రీ సీతారాములకు అలంకరించనున్న పట్టువస్త్రాలు, శ్రీరామ పట్టాభిషేకం రోజున అలంకరించనున్న పట్టువస్త్రాల తయారీకి ఉపయోగించే 4 రంగుల పట్టుదారాలను మంత్రి చేతులమీదుగా భద్రాచలంకు పంపించారు. సికింద్రాబాద్ గణేష్ దేవాలయంలో పట్టుదారాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పట్టుదారాలను ఆలయ చైర్మన్ జయరాజ్ కు మంత్రి అందజేశారు. భద్రాచలం ఆలయంలో మగ్గాలపై ఈ పట్టు దారాలతో స్వామివార్లను పట్టు వస్త్రాలను తయారీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నేతలు, చేనేత కళాకారులు వర్మాల సత్యనారాయణ, కరుణాకర్, రాపోలు గణేష్, తదితరులున్నారు.

ఉమెన్స్ డే సందర్భంగా మహిళా ఉద్యోగులకు సెలవు

హైదరాబాద్, మార్చి 6: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉద్యోగులకు తెలంగాణ సర్కార్ గుడ్‌న్యూస్ చెప్పింది.

ఆ రోజున రాష్ట్రంలోని మహిళా ఉద్యోగులందరికీ సాధారణ సెలవు దినంగా ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ,ప్రైవేటు సంస్థల మహిళలు సాధారణ సెలవుగా వినియోగించుకోవచ్చని ప్రభుత్వం వెల్లడించింది. అదేవిధంగా మహిళా దినోత్సవం సందర్భంగా సెర్ప్, మెప్మా మహిళలకు వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నట్లు మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు.

ఆశా వర్కర్లకు అత్యధిక వేతనాలిస్తున్న రాష్ట్రం తెలంగాణ: మంత్రి శ్రీ కే తారక రామారావు

రాజన్న సిరిసిల్ల, మార్చి 6: (నేటినిజం ప్రతినిధి): ఆశా వర్కర్లకు అత్యధిక వేతనాలు ఇస్తున్న రాష్ట్రం తెలంగణేనని మంత్రి శ్రీ కేటీఆర్ అన్నారు. ప్రధాని సొంత రాష్ట్రం గుజరాత్‌లో కంటే ఎక్కువగా వేతనాలు అందిస్తున్నామన్నారు. ఆశా వర్కర్లను ప్రభుత్వం కడుపులో పెట్టుకుని కాపాడుకుంటుందని స్పష్టం చేశారు.

సిరిసిల్ల నియోజకవర్గంలో పర్యటనలో భాగంగా మంత్రి శ్రీ కేటీఆర్.. తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలో నూతనంగా నిర్మించిన పల్లె దవాఖానను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు చేపడుతుందన్నారు. పల్లె దవాఖాన, బస్తీ దవాఖాన, హెల్త్ ప్రొఫైల్, ఉచిత డయాగ్నసిస్ సేవలు, కేసీఆర్ కిట్ వంటి కార్యక్రమాలు అమలవుతున్నాయని వెల్లడించారు.

అంతకుముందు జిల్లెల్ల ప్రభుత్వ ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ క్లాస్‌రూమ్, సోలార్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. పాఠశాలలో ఏర్పాటుచేసిన సైన్స్ ఫెయిర్‌ను తిలకించారు. విద్యార్థులతో మాట్లాడారు. వారు రూపొందించిన ప్రాజెక్టులను గురించి అడిగి తెలుసుకున్నారు.

సిరిసిల్ల ప్రెస్‌క్లబ్ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి హాజరు

టౌన్ క్లబ్ ఆవరణ లో ఏర్పాటు చేసిన సిరిసిల్ల ప్రెస్‌క్లబ్ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి మంత్రి శ్రీ కే తారక రామారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

నూతన సిరిసిల్ల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఆకుల జయంత్ కుమార్, ప్రధాన కార్యదర్శి పరకాల ప్రవీణ్, ఉపాధ్యక్షులు అతికం రఘు వీర్ గౌడ్, కోశాధికారి కాయితి మహేందర్, సహ కార్యదర్శి రాపెల్లి భాస్కర్, కార్యవర్గ సభ్యులు అల్లే రమేష్ , నాయిని బాబు, దాసరి శిరీష,జాన దయానంద్, అన్సార్ అలి, జక్కని రాజా రమేష్ ల చేత మంత్రి ప్రమాణ స్వీకారం చేయించారు.

నూతన కార్యవర్గ సభ్యులకు మంత్రి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మంత్రిని శాలువా, జ్ఞాపికతో సన్మానించారు.

రగుడు జంక్షన్ అభివృద్ధికి శంకుస్థాపన

తర్వాత మంత్రి సిరిసిల్ల పట్టణంలో ఐ డి సి పి సమీపంలోరగుడు కూడలి అభివృద్ధికి రూ.7 కోట్ల 70 లక్షల తో బై పాస్ కూడలి అభివృద్ధి, సుందరీకరణ, బైపాస్ రోడ్డు సెంట్రల్ లైటింగ్ కు శంకుస్థాపన చేశారు.

కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణా రాఘవ రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబుద్దిన్, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రైతు బంధు సమితి అధ్యక్షులు గడ్డం నర్సయ్య,

ఆర్డీఓ టి శ్రీనివాస్ రావు, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజలందరి జీవితాల్లో నూతనోత్తేజం వెల్లివిరియాలి.. - దేశ ప్రజలకు ముఖ్యమంత్రి కేసీఆర్ హోలీ పౌర్ణమి శుభాకాంక్షలు

హైదరాబాద్ మార్చ్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: వసంత రుతువుకు నాంది ప్రస్తావనగా, పచ్చని చిగురులతో కొత్తదనం సంతరించుకుని, వినూత్నంగా పున:ప్రారంభమయ్యే ప్రకృతి కాలచక్రానికి హోలీ పండుగస్వాగతం పలుకుతుందని సీఎం కేసీఆర్అన్నారు. చిగురించే ఆశలతో తమ జీవితాల్లోకి నూతనత్వాన్ని హోలీరూపంలో స్వాగతం పలికే భారతీయ సాంప్రదాయం రమణీయమైనదన్నారు. రాష్ట్ర, దేశ ప్రజలందరికీ ముఖ్యమంత్రి కేసీఆర్ హోలీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

హోలీ పండుగ నేపథ్యంలో పల్లెలన్నీ వెన్నెల నవరాత్రుల్లో సాగే చిన్నారుల జాజిరి ఆటా పాటలతో, కోలాటాల చప్పుళ్లతో ఉత్తేజం వెల్లివిరుస్తుందని సీఎం తెలిపారు. పిల్లా పెద్దా తేడాలేకుండా సింగిడి రంగుల నడుమ ఖేలీ కేరింతలతో సాగే హోలీ, మానవ జీవితమే ఒక వేడుక అనే భావనను, ప్రకృతితో మమేకమై జీవించాలనే తత్వాన్ని మనకు అందిస్తుందన్నారు.

బేధభావాలను వీడి పరస్పర ప్రేమాభిమానాలను చాటుకుంటూ ప్రజలందరూ మోదుగుపూల వంటి సహజసిద్ధమైన రంగులతో హోలీ పండుగను సంతోషంగా జరుపుకోవాలని సీఎం సూచించారు. స్వరాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రగతి కార్యాచరణ, తెలంగాణలోని దళిత బహుజన, సకల జనుల జీవితాల్లో నిత్య వసంతాన్ని నింపిందని సీఎం తెలిపారు. దేశ ప్రజలందరి జీవితాల్లో నూతనోత్తేజం వెల్లివిరిసేదాకా తమ కృషి కొనసాగుతూనే వుంటుందని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు.

కిడ్నీ మార్పిడిశస్త్ర చికిత్సలలో జాతీయ రికార్డు సృష్టించిన హైదరాబాద్ నిమ్స్

హైదరాబాద్ మార్చ్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రి జాతీయ రికార్డు సృష్టించింది. ఈ ఏడాది జనవరిలో 15 కిడ్నీ మార్పిడిశస్త్ర చికిత్సలు నిర్వహించింది. దేశంలో ఒకే నెలలో అత్యధిక కిడ్నీ మార్పిడులు చేసిన ప్రభుత్వ ఆసుపత్రిగా జాతీయ రికార్డు సాధించింది నిమ్స్. ఈ సందర్భంగా ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్ రావునిమ్స్ యూరాలజీవిభాగాన్ని అభినందించారు. సీఎం కేసీఆర్ఆదేశాల మేరకు అవయవ మార్పిడి సర్జరీలను ఖర్చుకు వెనుకాడకుండా ఆరోగ్యశ్రీ కింద పూర్తి ఉచితంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు.నిమ్స్ యూరాలజీ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ రాహుల్ దేవరాజ్ నేతృత్వంలో డాక్టర్ సీహెచ్ రామ్ రెడ్డి, డాక్టర్ ఎస్ విద్యాసాగర్, డాక్టర్ జీ రామచంద్రయ్య, డాక్టర్ జీవీ చరణ్ కుమార్, డాక్టర్ ఎస్ఎస్ఎస్ ధీరజ్‌తో కూడిన బృందం ఈ సర్జరీలను విజయవంతంగా నిర్వహించింది. డాక్టర్ పద్మజ, డాక్టర్ జే నిర్మల నేతృత్వంలోని అనస్థీషియా విభాగం, డాక్టర్ టీ గంగాధర్, డాక్టర్ భూషణ్ రాజ్ నేతృత్వంలోని నెఫ్రాలజీ విభాగం వారికి సహకరించారు.

మహిళా సంక్షేమానికి ఎన్నో పథకాలను అమలు

-ఈ నెల 8న మహిళల ఖాతాల్లోకి రూ.750కోట్లు : హరీశ్‌రావు

హైదరాబాద్ మార్చ్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్) సీఎం కేసీఆర్ మహిళా సంక్షేమానికి ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారని ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సంగారెడ్డి పట్టణంలో జిల్లా నమాఖ్య దుకాణ సముదాయాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, టీఎస్ ఐఎండీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, చేనేత సహకార సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్, కలెక్టర్ శరత్ పాల్గొన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ ద్వారా పేదల పెళ్లిళ్లకు రూ.1,00,116 ఇస్తున్నారన్నారు.మహిళల పౌష్టికాహారం కోసం ఆరోగ్యలక్ష్మి, అమ్మ ఒడి వాహనాలు, కేసీఆర్ కిట్ తీసుకువచ్చామన్నారు. సంగారెడ్డి జిల్లాలో 83శాతం ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీ అవుతున్నామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం మెరుగైందన్నారు. ఏప్రిల్ నుంచి కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. న్యూట్రిషన్ కిట్ తల్లికి అవసరమైన పౌష్టికాహారం ఉంటుందన్నారు. తెలంగాణలో 6లక్షల గర్భిణులు ఏడాదికి రెండుసార్లు న్యూట్రిషన్ కిట్ ఇస్తామన్నారు. మాతాశిశు మరణాలను తగ్గించేందుకు న్యూట్రిషన్ కిట్ తెస్తున్నామన్నారు.మహిళల కోసం ఇంటింటికీ నల్లా పెట్టి తాగునీరు ఇస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మిషన్ భగీరథ ద్వారా సురక్షిత తాగునీరు ఇస్తున్నామన్నారు. తెలంగాణలో 46 మహిళా రెసిడెన్షియల్ కాలేజీలు పెట్టి నాణ్యమైన విద్యనందిస్తున్నామన్నారు. దశలవారీగా రానున్న రోజుల్లో గ్రామ సమాఖ్య భవనాలు నిర్మిస్తామన్నారు. 100 మహిళా ఆసుపత్రిలను ప్రారంభం చేస్తామన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ఆరోగ్య మహిళా కార్యక్రమం తీసుకురాబోతున్నామన్నారు. ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా ప్రతి మంగళవారం మహిళలకు ప్రత్యేకంగా పరీక్షలు , మందులు ఇవ్వబోతున్నామన్నారు. ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని అందరూ వినియోగించుకోవాలన్నారు. మహిళా దినోత్సవ సందర్భంగా మహిళలకు వడ్డీ లేని రుణాలకు సంబంధించిన రూ.750 కోట్లు విడుదల అవుతాయన్నారు. ఈ నెల 8న మహిళల ఖాతాల్లో రూ.750 కోట్లు జలమవుతాయన్నారు. సెర్ప్, వీవోఏ ఉద్యోగులకు వేతన సవరణ చేసి జీతాలు పెరిగి వస్తాయన్నారు. ప్రభుత్వపరంగా మూడు ఐవీఎఫ్ ఇంఫటాలిటీ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. మహిళల కోసం ఎంతో కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌ను దీవించాలన్నారు.

చేపట్టిన 'హాథ్ సే హాథ్ జోడో యాత్ర' కు భద్రత కల్పించాలి

-రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్ మార్చ్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: రాష్ట్రంలో కాంగ్రెస్ చేపట్టిన 'హాథ్ సే హాథ్ జోడో యాత్ర' కు భద్రత పెంచాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఈ రోజు హైకోర్టు లో విచారణ జరిగింది. ఇరువాదనలు విన్న న్యాయస్థానం రేవంత్ పాదయాత్రకు పూర్తి భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇప్పటికే 69 మంది భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేశామని ప్రభుత్వ తరపు న్యాయవ్యాది హైకోర్టు దృష్టికి తెచ్చారు. కేవలం ట్రాఫిక్ కంట్రోల్ కోసమే పోలీసులను వినియోగిస్తున్నారని రేవంత్ తరపు లాయర్ కోర్టుకు తెలిపారు. రాత్రిబసలోనూ భద్రత కల్పించాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది.కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా చేపట్టిన భారత్ జోడో యాత్రకు అనుబంధంగా హాథ్‌సే హాథ్ జోడో యాత్రను టీపీసీసీ చేపట్టింది. ఫిబ్రవరి 6వ తేదీన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకే యాత్ర నిర్వహిస్తున్నామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. రాచరికానికి వ్యతిరేకంగా ప్రాణాలను లెక్క చేయకుండా పోరాడిన వనదేవతలు సమ్మక్క, సారలమ్మల స్ఫూర్తితో ఈ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. మొత్తం రెండు నెలల పాటు అన్ని నియోజకవర్గాల్లో కొనసాగనుంది. ప్రతీ ఇంటికి కాంగ్రెస్ స్టిక్కర్ అంటించడంతో పాటు ప్రభుత్వ వైఫల్యాలపై కరపత్రాన్ని ప్రజలకు పంపిణీ చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉండే సహజ స్వేచ్ఛను వినియోగించుకుని నేతలు తమదైన శైలిలో వారివారి నియోజకవర్గాల్లో జోడో యాత్రను నిర్వహిస్తున్నారు.

కుక్కలపై జీహెచ్ఎంసీ మేయర్ మరోమారు వివాదాస్పద వ్యాఖ్యలు

హైదరాబాద్ మార్చ్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);అంబర్ పేటలో వీధికుక్కల దాడిలో ప్రదీప్ అనే నాలుగేళ్ల బాలుడు ప్రాణాలు కోల్పోయిన అత్యంత విషాదకర ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ ఘటనపై ఇప్పటికే స్పందించిన జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ.. తాజాగా మరోసారి మాట్లాడి ఇటువంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఎవరినో ఉద్దేశించి ఆమె చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి.'ఎవరినో కుక్క కరిస్తే నేనే కరవమన్నట్లుగా వ్యాఖ్యలు చేస్తున్నారంటూ ' మేయర్ విజయలక్ష్మీ వ్యాఖ్యానించారు. మహిళలు బయటకు వస్తే సహించలేని వ్యక్తులు ఇటువంటి వ్యాఖ్యలే చేస్తారని.. రాజకీయాల్లో మహిళలు ఎదుగుతుంటే ఓర్వలేక ఇటువంటి వ్యాఖ్యలు చేస్తారంటూ విజయలక్ష్మీ సంచలన వ్యాఖ్యలు చేశారు.మహిళా దినోత్సవరం సందర్భంగా ఓ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ మాట్లా డుతూ అన్ని రంగాల్లో మహిళలు సాధించిన విజయాలను గుర్తు చేశారు.

అలానే రాజకీయాల్లో ఉంటే ఎలాంటి ఒత్తిళ్లు వస్తాయో.. వా టిని ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు.మహిళలు బయటకు వస్తే ఓర్వలేరు.. ఏదైనా సాధిస్తే ఓర్వలేరు.. రాజకీయాల్లో ఎదుగుతుం టే ఓర్వలేరు.. అటువంటి వ్యక్తులు ఇష్టాను సారంగా మాట్లాడుతుంటారని అన్నారు.

అంబర్ పేటలో ఎవరినో కుక్క కరిస్తే ఆ కుక్కను నేనే కరవమన్నట్లుగా వ్యాఖ్యలు చేశారని కావాలనే నాపై బురద జల్లుతున్నా రంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగర మేయర్ అంటే ఎన్నో బాధ్యతలుంటాయని.. ఎన్నో ఒత్తిడులు ఉంటాయని చెబుతూనే అంబర్ పేట కుక్క సంఘటన గురించి తనను అభాసుపాలు చేశారని మేయర్ వాపోయారు.

ఆ కుక్క ఎవరినో కరిస్తే .. నేనే కరవమన్నట్లు కొందరు మాట్లాడారు అంటూ వ్యాఖ్యానించారు.

ఆడబిడ్డలో ఆత్మస్థైర్యం కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌ది : ఎమ్మెల్సీ కవిత

కరీంనగర్, మార్చి 6: ఆడబిడ్డలో ఆత్మస్థైర్యం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌ది అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు. మహిళా సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని తెలిపారు. పోలీస్ శాఖతోపాటు ఇతర శాఖల్లో తెలంగాణ ప్రభుత్వం 33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తుంది అని కవిత గుర్తు చేశారు.

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్ రాంలీల మైదానంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుక(చినీఎవనిబ ఆజీఎ)ల్లో ఎమ్మెల్సీ కవిత పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సత్యవతి రాథోడ్, గంగుల కమలాకర్, మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయిన్‌పల్లి వినోద్ కుమార్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. మహిళా సంఘాలకు దేశంలో ఎక్కడా లేని విధంగా 54 లక్షల మందికి రూ. 18 వేల కోట్లను స్వాలంబన కింద అందిస్తున్నాం అని తెలిపారు. వడ్డీ లేని రుణాలు.. అభయహస్తం త్వరలోనే విడుదల చేస్తామన్నారు. వీఏవోలకు యూనిఫామ్‌లు ఇచ్చేలా కృషి చేస్తాం అన్నారు.

ఇన్నాళ్లు ఇంటికి పరిమితమైన ఆడబిడ్డలు ఇప్పుడు ఉద్యోగం కోసం బయటకు వస్తున్నారు అని కవిత తెలిపారు. ఉద్యోగం కోసం బయటకు వచ్చే ఆడబిడ్డలకు భద్రత కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఆడబిడ్డలను ఉన్నత చదువుల కోసం పక్క ఊరుకు పంపించాలంటే ఆలోచించాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. కానీ రూ. 8000 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల్లో ఆడపిల్లలకు టాయిలెట్లు నిర్మిస్తున్నాం అని తెలిపారు. ఇల్లు అద్దెకు దొరకకుండా ఇబ్బందులు పడుతున్న దళిత బిడ్డల కోసం ఎస్సీ డిగ్రీ కాలేజీలు, హాస్టళ్లను ఏర్పాటు చేశామన్నారు.

సచివాలయంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

- మహిళా సాధికారతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం- సి.ఎస్ శాంతి కుమారి

హైదరాబాద్, మార్చి 6 :: తెలంగాణ ప్రభుత్వం మహిళా సాధికారతకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని, దీనిలో భాగంగా అనేక మహిళా సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని సి.ఎస్ శాంతి కుమారి పేర్కొన్నారు. మహిళలు సమైక్యంగా, సమన్వయంతో ఉంటేనే తమ హక్కుల సాధనకు మార్గం ఏర్పడుతుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అభిప్రాయం వ్యక్తం చేశారు.బి.ఆర్.కే.ఆర్ భవన్ లో సచివాలయ మహిళా అధికారులు, సిబ్బంది నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, ప్రతి రంగంలో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి, వారి హక్కుల గురించి మహిళలకు అవగాహన కల్పించడానికి అనేక కార్యక్రమాలు ప్రభుత్వం చేపట్టిందని సి.ఎస్ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథులుగా ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణికుముదిని, ఆర్థిక శాఖ కార్యదర్శి టికే శ్రీదేవి, ప్రశాంతి , సచివాలయ మహిళా ఉద్యోగ సంఘం నాయకురాలు చిట్టి రాణి, ఎం. మంగమ్మ, ఉమా నాగ లక్ష్మి, పైక్ మాలిక, కరుణ రెడ్డి, చంద్రకళ, సింధూరి, శైలజ, విజయ నలిని, విజయ లక్ష్మి, చందన, అలేఖ్య, స్ఫూర్తి లతో పాటు పెద్ద ఎత్తున మహిళా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డీ లేని రుణాలు అంతర్జాతీయ మహిళా దినోత్సవ కానుక : మంత్రి దయాకర్‌రావు

హైదరాబాద్, మార్చి 6:అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం మహిళలకు వడ్డీ లేని రుణాలను విడుదల చేస్తూ ఒక గొప్ప కానుక ఇచ్చిందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సంతోషం వ్యక్తం చేశారు. రూ.750కోట్ల భారీ నిధులను ఆడబిడ్డల కోసం విడుదల చేసిన సీఎం కేసీఆర్, ప్రభుత్వానికి ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. నిధులలో రూ.250కోట్ల పట్టణ ప్రాంతాల మహిళల కోసం కాగా, రూ.500కోట్లు గ్రామీణ మహిళల కోసమని మంత్రి చెప్పారు. రూ.750 కోట్ల నిధులతో తెలంగాణ రాష్ట్రంలో అటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న మహిళా స్వయం సహాయక సంఘాలకు భారీ ఎత్తున లబ్ధి చేకూరుతుందని దయాకర్ రావు అన్నారు. ఈ మేరకు మంత్రి ఎర్రబెల్లి ఒక ప్రకటన విడుదల చేశారు.

రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో 4.31లక్షల చిన్న సంఘాలు ఏర్పాటు చేయడం జరిగిందని, 46,10,504 కుటుంబాల మహిళలు చిన్నసంఘాల్లో సభ్యులుగా ఉన్నారన్నారు. ఇప్పటిదాకా గత ప్రభుత్వాలు స్వయం సహాయక సంఘాలకు 10 ఏండ్లలో రూ.21,978 కోట్లు రుణాలు ఇస్తే, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు 8 సంవత్సరాల్లో రాష్ట్రంలోని వివిధ బ్యాంకుల ద్వారా రూ.66,624 కోట్లు మహిళా సంఘాలకు రుణాలుగా ఇప్పించినట్లు మంత్రి వివరించారు.

ఈ ఆర్థిక సంవత్సరానికి 3.67లక్షలకుపైగా సంఘాలకు రూ.18వేల కోట్లు రుణ లక్ష్యంగా నిర్ణయించడం జరిగింది. ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటి వరకు 2 లక్షల 29 వేల 382 సంఘాలకు రూ.14.47కో

2023లో ప్రపంచ ఆర్థిక మాంద్య గడ్డుకాలం రానుందా?!

2023లో ప్రపంచ దేశాలన్నీ ఆర్థిక మాంద్యాన్ని ఎదుర్కోనున్నాయని, ప్రపంచ జిడిపీ కుచించుకుపోనున్నదనే కఠిన వాస్తవాన్ని 'సెంటర్ ఫర్ ఎకనమిక్స్ అండ్ బిజినెస్ రీసెర్చ్ (సిఈబిఆర్)' సంస్థతో పాటు ఇతర అంతర్జాతీయ స్థాయి సంస్థలు హెచ్చరికలు చేయడం చూస్తున్నాం. 2022లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 100 ట్రిలియన్ డాలర్లకు చేరడం, 2023లో అక్కడే ఆగిపోవడం గమనిస్తున్నాం. 'బ్లూమ్స్‌బర్గ్' వివరణ ప్రకారం 2023లో పలు దేశాల్లో ఆర్థిక మాంద్యం ఏర్పడుతుందని గత అక్టోబర్-2022లోనే అంచనా వేసింది. అభివృద్ధి చెందిన దేశాలతో పాటు ఏసియా పసిపిక్ దేశాల్లో 2037 నాటికి ఆర్థిక ప్రగతి రెట్టింపు కావచ్చని, యూరోపియన్ దేశాల్లో కొంత మాంద్యం ఇంకా కొనసాగవచ్చని తెలుస్తున్నది. ప్రపంచ ఆర్థిక మాంద్య అగ్నికి రష్యా - ఉక్రెయిన్ యుద్ధం, చైనాను వెంటాడుతున్న కోవిడ్ మహమ్మారి ప్రభావం, అధిక ద్రవ్యోల్బణం, కఠిన ఆర్థిక పాలసీలు, పెరుగుతున్న వడ్డీ రేట్లు, పలు దేశాల్లో రాజకీయ సంఘర్షణలు ఆజ్యం పోస్తున్నాయని తెలుస్తున్నది. నేడు ప్రపంచ ద్రవ్యోల్బణం 40 ఏండ్ల గరిష్ట స్థాయికి చేరినట్లు, దీనికి విరుగుడుగా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను పెంచడం గమనించాం. ఆర్థిక నిపుణుల అంచనాల ప్రకారం 2023 తొలి క్వార్టర్‌లోనే అమెరికా ఆర్థిక మాంద్యాన్ని ఎదుర్కోనున్నట్లు హెచ్చరిస్తున్నారు.

ఇండియాపై ప్రపంచ ఆర్థిక మాంద్య ప్రభావం:

రానున్న 6 మాసాల్లో భారతం ఆర్థిక మాంద్యాన్ని చవిచూడవచ్చని, దీని ఫలితంగా ఆర్థిక వ్యవస్థ మందగించే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అంగీకరించడం, వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ హెచ్చరించడం గమనించాం. ద్రవ్యోల్బణాన్ని అరికట్టేందుకు దేశాలు అప్పులు చేయడానికి కూడా వెనకాడడం లేదు. అధిక ద్రవ్యోల్బణానికి ప్రతిస్పందనగా వడ్డీ రేట్లు పెరగడంతో 2023లో ఆర్థిక మాంద్యం ఎదుర్కొనే అవకాశం అధికంగా ఉన్నట్లు తెలుపుతున్నారు. రానున్న మాసాల్లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు మూడో వంతు కుదించుకు పోవచ్చని తెలుపుతున్నారు. 2035 నాటికి భారత ఆర్థిక వ్యవస్థ 10 ట్రిలియన్ డాలర్లకు చేరుతూ 3వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశంగా నిలుస్తుందని ఊహిస్తున్నారు. రాబోయే 15 ఏండ్లలో యూకె 6వ పెద్ద ఆర్థిక వ్యవస్థగా, ఫ్రాన్స్ 7వ పెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలువవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన సూపర్ పవర్ అమెరికాలో మాంద్యం ఏర్పడితే దాని ప్రభావం ప్రపంచ దేశాలపై కూడా పడుతుందని వివరిస్తున్నారు. ప్రపంచ ఆర్థిక మాంద్యం మూలంగా యూరోపియన్ బ్యాంకులు విఫలం కావడం, స్టాక్ మార్కెట్లు కుప్పకూలడం, భారత మార్కెట్ విలువలు పడిపోవడం జరుగవచ్చని తేల్చారు. అమెరికా ఏజన్సీలతో దగ్గరి సంబంధాన్ని కలిగి ఉన్న భారతంతో ఆర్థిక మాంద్య ప్రభావం స్పష్టంగా కనిపిస్తుందని అంచనా వేస్తున్నారు. 2008లో ప్రపంచం చవిచూసినా ఆర్థిక మాంద్య ప్రభావం నుంచి నాటి భారతం బయట పడడానికి మన దేశంలోని వ్యవసాయరంగం, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెరగడం, విదేశీ కంపెనీల ప్రాజెక్టులు కొనసాగడం, దేశీయ బ్యాంకింగ్ రంగం సుస్థిరతను ప్రదర్శించడం లాంటి పలు కారణాలు దోహదపడడం గమనించాం. దేశ ఆర్థిక మాంద్యాన్ని ఎదుర్కోవడానికి పలు సంస్థలు ఉద్యోగులను తొలగించడం ఇప్పటికే ప్రారంభించారు. ప్రపంచవ్యాప్తంగా అధిక ఆర్థిక మందగమనం కనిపించినప్పటికీ దాని ప్రభావం ఇండియాపై అంతగా ఉండకపోవచ్చని తెలుస్తున్నది. ఇండియాలో తయారీ రంగ సరఫరా శృంఖలం పటిష్టంగా ఉండడంతో పాటు తయారీదారులు చైనాను వీడి ఇండియా వైపు చూడడం కూడా శుభపరిణామంగా పేర్కొంటున్నారు. ఇటీవల మన దేశంలో ఆర్థిక సూచీలు మెరుగైన పని తీరును కనబర్చడం, ద్రవ్యోల్బణం అదుపులో ఉండడం, నవంబర్-2022లో పారిశ్రామికోత్పత్తి 7.1 శాతం పెరగడం, కంపెనీలు మెరుగైన ప్రణాళికలు కనబర్చడం లాంటివి భారత ఆర్థిక స్థిరత్వాన్ని నిలుపుతున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థలకు కారుమబ్బులు కమ్ముకుంటున్నాయని, ద్రవ్యోల్బణం దశాబ్దాల గరిష్టానికి ఎగబాకిందని, అన్ని దేశాలకు వీటి ప్రభావం పడుతున్నదని ఐయంయఫ్ హెచ్చరించడం గమనార్హం. ప్రపంచ దేశాల్లో 33 శాతం వరకు ఆర్థిక వ్యవస్థలు ఇబ్బందులను ఎదుర్కొంటాయని, ప్రపంచ జిడిపీ 2 శాతం కన్న తక్కువగా ఉండే అవకాశం ఉందని, ఇవన్నీ ఆర్థిక మాంద్యానికి సూచికలని తెలుపుతున్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఆయువు పట్టుగా వ్యవసాయరంగం భారతానికి ఆర్థిక స్థిరత్వాన్ని కలిగిస్తున్నదని, దీనితో పాటు పారిశ్రామిక రంగం కూడా ఇండియా ఆర్థిక పటుత్వానికి ఊతం ఇవ్వాలని కోరుకుందాం. ప్రపంచ దేశాలు ఆర్థిక మాంద్య షాకులకు గురైనప్పటికి ఇండియా మాత్రమే ఆర్థికంగా స్థిరత్వాన్ని ప్రదర్శించాలని ఆశిద్దాం, మన వంతు కర్తవ్యాలను నిర్వహిద్దాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

మెడికల్ కాలేజీల విషయంలో కేంద్రం అన్యాయం చేసింది

హైదరాబాద్ మార్చ్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);మెడికల్ కాలేజీ ల విషయం లో కేంద్ర కు అన్యాయం చేసిందన్నది పచ్చినిజమని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. గవర్నర్ చేసిన వ్యాఖ్యలపై ట్విట్టర్ వేదికగా మంత్రి హరీశ్‌రావు స్పందించారు. అలాగే గతంలో వైద్య కళాశాలల కేటాయింపుపై కేంద్రాన్ని ఈటల రాజేందర్ కోరిన విషయాన్ని సైతం మంత్రి హరీశ్‌రావు ట్వీట్ చేశారు. రాష్ట్రానికి మెడికల్ కాలేజీలు మంజూరు చేయాలని పలుమార్లు కేంద్రాన్ని కోరితే 157 మెడికల్ కాలేజీల్లో ఒక్కటి కూడా ఇవ్వకుండా తెలంగాణకు ఇవ్వకుండా మొండిచేయి చూపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఒకటి, రెండో ఫేజ్‌లో ఒక్క కాలేజీ ఇవ్వలేదని, మూడో ఫేస్‌లో ఇస్తామని చివరకు మోసం చేశారని ధ్వజమెత్తారు. ఇప్పుడు నర్సింగ్ కాలేజీల విషయంలోనూ అదే వివక్షను ప్రదర్శిస్తుందని మండిపడ్డారు. మెడికల్ కాలేజీల విషయంలో ఒక్కో మంత్రి ఒక్కో విధంగా మాట్లాడడం బాధాకర మన్నారు. ఒకరు రాష్ట్ర ప్రభుత్వం అడుగలేదని అంటే.. మరొకరు కరీంనగర్, ఖమ్మంలో మెడికల్ కాలేజీ కోసం తెలంగాణ అడిగిందని, అక్కడ ప్రైవేటు మెడికల్ కాలేజీలు ఉండడంతో మంజూరు చేయలేకపోయామని చెబుతున్నారని గుర్తు చేశారు. ఎవరు ఎవరిని మోసం చేస్తున్నారు ? ఎవరు తప్పుదారి పట్టిస్తున్నారు? అంటూ మంత్రి నిలదీశారు.కేంద్రం మెడికల్ కాలేజీ ఇవ్వకున్నా, పైసా నిధులు మంజూరు చేయకున్నా సీఎం కేసీఆర్ సొంత నిధులతో రాష్ట్రంలో 12 మెడికల్ కాలేజీలు ప్రారంభించారన్నారు. ఈ ఏడాది తొమ్మిది, మరో ఏడాది ఎనిమిది ఇలా జిల్లాకో మెడికల్ కాలేజీ ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. లక్ష జనాభాకు 19 ఎంబీబీఎస్ సీట్లతో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్‌గా ఉండడం వాస్తవం కాదా? అన్నారు. ఒకే ఏడాది, ఒకే రోజున తెలంగాణ ప్రభుత్వం ఎనిమిది మెడికల్ ప్రారంభిస్తే, ప్రశంసించేందుకు మనసు రానివాళ్లు ఇలా పసలేని విమర్శలు, ఆరోపణలు చేయడం సమంజసమా? అని ప్రశ్నించారు.

వైయస్ఆర్ కంటి వెలుగు ఫేజ్-3ను ప్రారంభం

అమరావతి, మార్చి 6:మూడో దశ వైయస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించారు. తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో వర్చువల్‌గా ఫేజ్-3ని సీఎం వైయస్ జగన్ ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రి విడదల రజిని, సీఎస్ జవహర్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ? చూపు కొద్దిగా మందగించినా జీవనం కష్టమవుతూ ఉంటుందని, రాష్ట్ర ప్రజల కంటి చూపు పరిరక్షణకు చోటిచ్చామన్నారు. రాష్ట్రంలోని ప్రజలందరికీ కంటి వైద్య పరీక్షలు చేయాలని నిర్ణయించామన్నారు. ఇందుకోసమే వైయస్ఆర్ కంటి వెలుగు పథకాన్ని ప్రవేశపెట్టామన్నారు. ఆరు దశల్లో చేపట్టిన ఈ కార్యక్రమంలో తొలి రెండు దశల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 66.17 లక్షల మంది పిల్లలను పరీక్షించినట్లు తెలిపారు.

రాష్ట్రంలోని పట్టణాల్లో మహిళా వారోత్సవాలు :మంత్రి కేటిఆర్

హైదరాబాద్ మార్చ్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రంలోని పట్టణాల్లో మహిళా వారోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు పురపాలక శాఖ మంత్రి కే. తారక రామారావు తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా సమాజంలో మహిళల శక్తిని, పాత్రను సెలబ్రేట్ చేసేలా ఈ ఉత్సవాలు నిర్వహించాలని, ఇందుకు సంబంధించి అవసరమైన కార్యాచరణను రూపొందించాలని పురపాలక శాఖ అధికారులను ఆదేశించారు. ఈనేపథ్యంలో మహిళా వారోత్సవాలను నిర్వహించేందుకు పురపాలక శాఖ కార్యాచరణను ప్రకటించింది. మార్చి 8న మహిళా దినోత్సవం రోజున ప్రారంభమయ్యే ఈ వారోత్సవాల్లో వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నది. పురపాలికల్లో వివిధ హోదాలలో ప్రాతినిధ్యం వహిస్తున్న మహిళా ప్రజాప్రతినిధులు, పురపాలక శాఖ సిబ్బంది, స్వయం సహాయక సంఘాలు సభ్యులు, పారిశుద్ధ్య కార్మికులు, వివిధ ఎన్జీవోల సిబ్బందితో ఈ మహిళా దినోత్సవ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపింది. వారం పాటు నిర్వహించే ఈ మహిళ వారోత్సవాల్లో క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు, మహిళలకు హెల్త్ క్యాంపుల నిర్వహణ, వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు సన్మానం వంటి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు మంత్రి కేటీఆర్ తెలిపారు. దీంతోపాటు పురపాలికల్లో ఏదైనా ఒక రంగంలో ముఖ్యంగా డ్రై కంపోస్ట్, కిచెన్ కాంపోస్టింగ్, నీటి సంరక్షణ లాంటి మొదలైన రంగాల్లో ఆదర్శవంతమైన పద్ధతుల్లో ముందుకెళ్తున్న పురపాలికల సిబ్బంది లేదా పట్టణంలోని మహిళలను ప్రత్యేకంగా గుర్తించి వారిని సన్మానించాలని సూచించారు. దీంతోపాటు పట్టణాల్లో మహిళ స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో తయారైన ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాల క్యాంపులు నిర్వహించాలని, ప్రభుత్వ రుణాలు, సబ్సిడీల వంటి వాటిని వినియోగించుకొని స్వయం సమృద్ధి సాధించిన వీధి వర్తకుల నుంచి మొదలుకొని మహిళా వ్యాపారవేత్తల వరకు వివిధ రంగాలకు చెందిన ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలను ప్రత్యేకంగా గుర్తించాలని మంత్రి సూచించారు. కంటి వెలుగు ద్వారా పురపాలక శాఖలోని మహిళా ఉద్యోగులందరికీ ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు.మహిళా రక్షణ, మహిళ ఆరోగ్య సంరక్షణ, మహిళా సాధికారికత వంటి అంశాల పైన ప్రత్యేక సమావేశాలు చర్చాగోష్ఠులను నిర్వహించి మరింత అవగాహన పెంచేలా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. దీంతోపాటు ఈ వారోత్సవాల్లో మహిళలకు వడ్డీ లేని రుణాలను పంపిణీ చేసే కార్యక్రమాలను కూడా సిద్ధం చేయాలన్నారు. వారం పాటు జరిగే ఈ సంబరాలకు వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉన్నతాధికారులను, విభాగాధిపతులను, మహిళా జిల్లా కలెక్టర్లను, పోలీస్ ఉన్నతాధికారులు, మహిళా జడ్జీల వంటి వారిని ప్రత్యేక అతిథులుగా ఆహ్వానించి ఈ కార్యక్రమాలను నిర్వహించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని పురపాలక శాఖ అధికారులకు మంత్రి కేటీఆర్ సూచించారు. మార్చి 8 నుంచి వారం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాలన్నింటిని ఘనంగా నిర్వహించేందుకు వకడ్బందీ ప్రణాళికతో ముందుకు పోవాలని, ఈ మహిళా వారోత్సవాలను విజయవంతం చేయాలని మంత్రి కేటీఆర్ అధికారులను కోరారు.

రామగోపాల్ రెడ్డిని గెలిపించండి.. కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి

అమరావతి, మార్చి 6:తెలుగుదేశం పార్టీ బలపరచిన పచ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మంత్రాలయం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్ చార్జ్ పాలకుర్తి తిక్కారెడ్డి కోరారు. సోమవారం వారు తెలుగుదేశం పార్టీ మంత్రాలయం నియోజకవర్గం పరిశీలకులు రామాంజినమ్మ, ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు భీమవరం నాగేశ్వరరావుతో కలిసి కోసిగిలో మండల కన్వీనర్ జ్ఞానేష్ అధ్యక్షతన తెలుగుదేశం పార్టీ బలపరచిన పచ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని, ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్తల కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రాడ్యుయేట్ ఓటర్లతో మాట్లాడుతూ? వైయస్సార్ ప్రభుత్వం యువతకు అనేక హామీలు ఇచ్చి, ఒక్క ఉద్యోగం గాని పరిశ్రమలు గాని ఇవ్వకుండా మోసం చేసిందని, ఈనెల 13వ తేదీన జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ తెలుగుదేశం పార్టీ బలపరచిన పచ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వారన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే యువతకు ఉద్యోగం, ఉపాధి అవకాశాలు ఎక్కువగా వస్తాయన్నారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి, తెలుగు యువత జిల్లా ప్రదాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి, వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షులు భరద్వాజ్ శెట్టి, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి నాడిగేని అయ్యన్న, నాడిగేని రంగన్న, తెలుగు యువత జిల్లా మీడియా కోర్డినేటర్ విజయ రామిరెడ్డి, పంపాపతి, కోండగేని వీరారెడ్డి, సాతూనురు కోసిగయ్య, నాడిగేని వీరారెడ్డి, వద్దే రామయ్య, లక్ష్మీకాంత్, గోపాల్, డీలర్ నరసన్న, ఈరయ్య, మైనార్టీ నాయకులు ఖలదర్, గౌస్, తెలుగు మహిళ జిల్లా కార్యదర్శి నాడిగేని నర్సమ్మ, చిన్న భూంపల్లి మాజీ సర్పంచ్ నరసింహులు, జంపాపురం మాజీ సర్పంచ్ క్రిష్ణరెడ్డి, వందగల్ మాజీ సర్పంచ్ నరసింహులు, పల్లేపాడు మాజీ సర్పంచ్ చంద్ర, బెళగల్ సర్పంచ్ రామయ్య, తెలుగు యువత మండల అధ్యక్షులు నాడిగేని మహదేవ్, యస్ సి సెల్ నాయకులు యం పి టి సి సభ్యులు రాజు, మారేప్ప, ఈరేష్, బుడ్డన్న, అంపయ్య, వక్రాని వెంకటేష్, మదిరి వీరారెడ్డి, కందూకురు రామన్న గౌడ్, కురువ అయ్యన్న, ఆర్లబండ సర్పంచ్ మల్లికార్జున, రామంజినేయులు, అయ్యన్న, ఈరయ్య, బసవ, వారం గోపాల్, పెద్ద భూంపల్లి జనార్ధన్, మారెయ్య, అంపయ్య, రామయ్య, ప్రభాకర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ఉసేని, గుండేష్, గోపాల్, నరసింహ రెడ్డి, లీగల్ సెల్ నాగరాజు, ఐ టిడిపి అధ్యక్షులు సల్మాన్ రాజు, భూంపల్లి నీలకంఠ, దుద్ది నాగేష్, అంజినిరెడ్డి, పరుశాయ్ హనుమంతు, దొడ్డయ్య, పెద్ద భూంపల్లి హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ పొంగులేటి పార్టీ మారడం ఖాయమైపోయింది

హైదరాబాద్ మార్చ్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);బీఆర్ఎస్ లో అసమ్మతి రాజేస్తున్న ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పార్టీ మారడం ఖాయమైపోయింది. ఏ పార్టీలో చేరుతారనే దానిపైనే కొంత కాలంగా చర్చలు సాగుతున్నాయి. ఖమ్మం జిల్లాలోని అన్ని నియోజక వర్గాల్లో పొంగులేటి తన మద్దతు దారులతో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. గత కొంతకాలంగా పొంగులేటికి కాంగ్రెస్ నుంచి బీజేపీ నుంచి ఆఫర్లు వచ్చాయి.అయినా ఆయ న చేరలేదు. ఆ తర్వాత విజయమ్మతో పొంగులేటి భేటి ఆసక్తి రేపింది. షర్మిల పార్టీలో పొంగులేటి చేరడం గ్యారెంటీ అన్న చర్చ సాగింది. అందులోనూ ఆయన చేరలేదు. చివరకు ఏపీలో అధికారంలో ఉన్న వైసీపీ పార్టీ తరుపున నిలబడుతాడని అన్నారు. అది కుదరడం లేదు.ఈ క్రమంలోనే అధికార బీఆర్ఎస్ పైన విమర్శలు గుప్పిస్తూ పాలేరు కేంద్రంగా మరోసారి తన రాజకీయ భవిష్యత్ పై పొంగులేటి కీలక వ్యాఖ్యలు చేశారు. తాజాగా పాలేరులో పొంగులేటి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ పై విరుచుకు పడ్డారు. ధనిక రాష్ట్రమని చెప్పుకునే తెలంగాణ ఇప్పుడు అప్పుల పాలైందని విమర్శించారు. ఉపాధి అవకాశాలు లేవన్నారు. రైతులకు రుణ మాఫీ అమలు కాలేదన్నారు. డబుల్ బెడ్ రూంలు నిర్మాణం జరగలేదన్నారు. ప్రజలకు కేసీఆర్ ప్రభుత్వం మసిపూసి మారేడు కాయ చేసిందని విమర్శించారు.కేసీఆర్ విషయంలో ప్రజలు రెండు సార్లు మోసపోయారని.. మూడోసారి ఎవ రూ మోసపోతారో ఎన్నికల్లో తెలుస్తుం దని పొంగులేటి వ్యాఖ్యానించారు. తాను రాజకీయంగా నిర్ణయం తీసు కునే సమయంలో ఖచ్చితంగా ఏ పార్టీ లోకి వెళతానన్నది ప్రకటిస్తానని పొం గులేటి అన్నారు. జెండా ఏదైనా అజెం డా మాత్రం ఒక్కటేనని పొంగులేటి స్పష్టం చేశారు. ఎన్నికల సమయం వస్తోం దని..ప్రతీ ఒక్కరూ అప్రమత్తం గా ఉండాలని పొంగులేటి పిలుపునిచ్చారు.

తమ పార్టీ ఇప్పటికే అమరావతి రాజధానికి కట్టుబడి ఉంది

- కేంద్ర పర్యాటక మంత్రి కిషన్ రెడ్డి..

హైదరాబాద్, మార్చి 6:ప్రస్తుతం ఏపీ రాజధాని విషయంలో ఎవరు ఏం మాట్లాడినా రాజకీయంగా పెను దుమారం రేగుతోంది. ముఖ్యంగా బీజేపీ నాయకులు.. అందునా కేంద్ర మంత్రులుగా ఉన్నవారు.. అసలు రాజధాని ప్రస్తావనే లేకుం డా.. రాష్ట్ర పర్యటనలు ముగించేస్తున్నారు. దీనికి రాజకీయంగాను న్యాయపరంగాను కూడా ఇబ్బందులు ఉన్నాయి. దీంతో ఏపీ రాజధాని అంశంలో ఆచి తూచి అడుగులు వేయాల్సిన పరిస్థితి నెలకొంది.అయితే.. అనూహ్యంగా కేంద్ర పర్యాటక మంత్రి తెలుగు నాయకుడు.. కిషన్ రెడ్డి.. ఏపీ రాజధాని విషయంలో చేసిన కామెంట్లు దుమారం రేపాయి. ప్రస్తుతం ఉత్తరాంధ్రలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నాయి.ఈ నేపథ్యంలో అక్కడ పోటీలో ఉన్న బీజేపీ నాయకుడు మాధవ్ తరపున కిషన్ రెడ్డి ప్రచారం చేశారు. అయితే.. ఈ సందర్భంగా ఆయన 'విశాఖ రాజధాని' అనే కామెంట్ చేశారు. దీంతో ఇది కాస్తా వివాదానికి దారి తీసింది.వైసీపీ ప్రభుత్వ పెద్దలు విశాఖను రాజధాని చేయాలని చూస్తున్న విషయం తెలిసిందే. అయితే.. అమరావ తి డిమాండ్ ఓ వైపు వినిపిస్తోంది. దీంతో ఇది కాస్తా న్యాయపోరాటంలో ఉంది. ఫలితంగా.. ఎవరూ కూడా బాహాటంగా రాజధానిపై ఎలాంటి కామెంట్లు చేయడం లేదు. ఈ క్రమంలో కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్య.. ప్రభుత్వ అనుకూల మీడి యాలో జోరుగా వైరల్ అయింది. వాస్తవానికి.. బీజేపీ అమరావతినే సపోర్టు చేస్తున్న విషయం తెలిసిందే.దీంతో కిషన్ చేసిన వ్యాఖ్యలు రచ్చకు దారితీశాయి. దీంతో ఆయనే స్వయంగా వివరణ ఇచ్చుకున్నారు. తాను విశాఖ జిల్లాను దృష్టిలో పెట్టుకుని చేసిన వ్యాఖ్యలేనని చెప్పారు. తమ పార్టీ ఇప్పటికే అమరావతి రాజధానికి కట్టుబడిందని ఈవిషయాన్ని గుర్తించాలని ఆయన సూచించారు.తాము.. కూడా పార్టీ లైన్కే కట్టుబడి ఉన్నామన్నారు. అయితే.. కిషన్ రెడ్డి వ్యాఖ్యలు అప్పుడే.. వైరల్ కావడంతో బీజేపీ ఇమేజ్పై మరో మరక పడినట్టు అయిందని అంటున్నారు పరిశీలకులు.

డాక్టర్ ప్రీతి కేసు డీజీపీకి సీపీ ఏం చెప్పబోతున్నారు..?

హైదరాబాద్ మార్చ్ 6 ();తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన డాక్టర్ ప్రీతి కేసు కొత్త మలుపులు తిరుగుతోందా..? రేపట్నుంచీ ఈ కేసులో సీన్ మొత్తం మారనుందా..? ఇప్పటికే నిందితుడిని సుదీర్ఘంగా విచారించిన పోలీసులు ఈసారి కొత్త ప్రయోగం చేయబోతున్నారా..? అందుకే తెలంగాణ డీజీపీ నుంచి వరంగల్ సీపీ రంగనాథ్‌కు ఫోన్ కాల్ వెళ్లిందా..? డీజీపీకి సీపీ ఏం చెప్పబోతున్నారు..? సీపీతో డీజీపీ ఏం మాట్లాడబోతున్నారు..? క్లాస్ తీసుకుంటారా.. లేకుంటే సలహాలు ఇస్తారా..? అనే విషయాలపై సర్వత్రా ఉత్కంఠ..! నెలకొంది.

మెడికో ప్రీతి కేసులో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. ఇప్పటికే నిందితుడు సైఫ్ నుంచి పలు కీలక విషయాలను పోలీసులు రాబట్టగా.. ప్రత్యేక బృందం ఇంకా లోతుగా విచారిస్తోంది. సైఫ్ చెప్పిన సమాచారాన్ని బట్టి సాంకేతికంగా ఏం చేయొచ్చు..? ఎలా ముందుకెళ్లొచ్చు..? అని పోలీసులు ఆలోచిస్తున్నారు. అతి త్వరలోనే ఈ కేసును ఓ కొలిక్కి తీసుకురావాలని ఉన్నతాధికారులు అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. అటు విచారణ జరుగుతుండగానే వరంగల్ సీపీ రంగనాథ్‌కు.. డీజీపీ అంజనీకుమార్ నుంచి పిలుపొచ్చిందనే వార్త ఇప్పుడు బయటికొచ్చింది. సోమవారం ఉదయం డీజీపీని రంగనాథ్ కలవబోతున్నారు. ఈ మీటింగ్‌పై సోషల్ మీడియాలో, మీడియాలో చిత్రవిచిత్రాలుగా రూమర్స్ వస్తున్నాయి. సోమవారం ఏం జరుగుతోందనే దానిపై జనాల్లో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ఏం చేయబోతున్నారు..?

డీజీపీ-వరంగల్ సీపీ భేటీలో పలు విషయాలు చర్చకు వచ్చే అవకాశముంది. ప్రీతి ఘటన తర్వాత ప్రెస్‌మీట్ పెట్టిన సీపీ రంగనాథ్.. నిందితుడు సైఫ్ గురించి, ఎలా వేధించారనే దానిపై పూసగుచ్చినట్టుగా వివరించిన విషయం తెలిసిందే. కేసులో ఇప్పటి వరకూ అసలేం జరిగింది..? తర్వాత ఏం చేయబోతున్నారు..? అనేదానిపై ఇద్దరి మధ్య చర్చ జరగనుందట. మరోవైపు.. ప్రీతి ఆత్మహత్యాయత్నం మొదలుకుని ఆమె చనిపోయే వరకూ ఏం జరిగింది..? మొదట ఆస్పత్రికి తరలించినప్పుడు, నిమ్స్‌లో ఏమేం ట్రీట్మెంట్ చేశారు..? విచారణలో ఏం తేల్చారు..? టెక్నికల్‌గా పోలీసులు సంపాదించిన ఆధారాలు ఇవన్నీ ఓ నివేదిక రూపంలో డీజీపీకి రంగనాథ్ సమర్పించనున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇవన్నీ డీజీపీ చూసిన తర్వాత ఎలా ముందుకెళ్లాలి..? అనేదానిపై కొన్ని సలహాలు, సూచనలు కూడా చేయనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు.. ఇప్పటి వరకూ ప్రీతి కేసులో మీడియాకు పోలీసులు, ఉన్నతాధికా రులు ఎలాంటి సమాచారం ఇవ్వ లేదు. చాలా గోప్యంగానే విచారణ జరుపుతున్నారన్న విషయం తెలిసిందే. అందుకే ఈ విషయాలన్నీ మొదట డీజీపీకి చెప్పిన తర్వాతే మీడియాకు చెప్పాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారట.

సంక్షోభాలను అవకాశాలుగా మార్చుకున్న మోదీ-పుతిన్

న్యూఢిల్లీ మార్చ్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: భారత్-రష్యా సరికొత్త రికార్డ్ నెలకొల్పాయి. రష్యా నుంచి భారత్ ఫిబ్రవరి నెలలో 1.6 మిలియన్ బ్యారెళ్లు ముడి చమురు దిగుమతి చేసుకుంది. ఇది ఇరాక్కౌదీ అరేబియాలనుంచి దిగుమతి చేసుకుంటున్న దానికన్నా ఎక్కువ.2022 ఫిబ్రవరిన రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమయ్యే సమయానికి రష్యా నుంచి భారత్‌కు చమురు దిగుమతులు కేవలం ఒక్క శాతం మాత్రమే ఉండేవి. ప్రస్తుతం 35 శాతానికి చేరుకున్నాయి. భారత్‌కు చమురు దిగుమతి చేస్తున్న దేశాల్లో రష్యా వరునగా ఐదో నెలలో కూడా అగ్రస్థానంలో ఉంది. ఈ వివరాలన్నింటినీ ఎనర్జీ కార్గో ట్రాకర్ వొర్టెక్సా అందించింది.ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా చమురు దిగుమతి చేసుకుంటున్న దేశాల్లో చైనా, అమెరికాల తర్వాత భారత్ మూడో అతి పెద్ద దేశం.

ఇరాక్ నుంచి భారత్‌కు ఫిబ్రవరి నెలలో 9,39,921 బ్యారెళ్ల చమురు దిగుమతి కాగా సౌదీ అరేబియా నుంచి 6,47,813 బ్యారెళ్ల చమురు దిగుమతి అయింది. యూఏఈ నుంచి భారత్‌కు ఫిబ్రవరి నెలలో 4,04,570 బ్యారెళ్ల చమురు దిగుమతి కాగా అమెరికా నుంచి 2,48,430 బ్యారెళ్ల చమురు దిగుమతి అయింది.రష్యా-ఉక్రెయిన్ యు

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో సాధించింది ఏమిటి ?

అమరావతి మార్చ్ 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్);వైఎస్ జగన్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా విశాఖలో చేపట్టిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ మొదటి రోజు అంతంత మాత్రమే జరగ్గా.. రెండోరోజు అట్టర్ ఫ్లాప్ అయ్యింది. మొదటి రోజు కాస్త మీడియాలో కనిపించిన ఈ సమ్మిట్.. రెండో రోజు కనీసం జనం చర్చించుకునే లోపే అలా ముగిసిపోయింది. రెండో రోజు డెలిగేట్స్, ఇన్వస్టర్స్ లేక సదస్సు వెలవెలబోయింది. దీంతో ఎక్కడ డ్యామేజ్ అవుతుందో అని అప్పటికప్పుడు సచివాలయ సిబ్బంది, స్థానికంగా ఉన్న ఎంబీఏ స్టూడెంట్స్‌ను అధికారులు తరలించారు. కనీసం.. వారికి పాస్ కూడా ఇవ్వకుండానే డైరెక్టగా సదస్సులోనికి అనుమతించేశారు. అయినప్పటికీ సమ్మిట్‌లో ఖాళీ కుర్చీలు కనిపించడం గమనార్హం. మరోవైపు.. జగన్ సర్కార్‌తో ఎంవోయూలు కుదుర్చుకున్న ఆ విదేశీ కంపెనీలేంటో తెలుసుకుందామకున్న రాష్ట్ర ప్రజల ఆశలు అడియాసలే అయ్యాయి. అంతేకాదు కనీసం విదేశీయుల ముఖాలు అయినా చూద్దామంటే రెండో రోజు ఎవరూ లేకపోవడంతో సమ్మిట్ తుస్సనిపించింది. ఒక్క మాటలో చెప్పాలంటే రెండోరోజు సమ్మిట్ తూతూ మంత్రంగానే సాగిందనే చెప్పుకోవచ్చు.

అధికారిక ప్రకటనలేవీ..!

14 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని సభావేదిక నుంచే సీఎం వైఎస్ జగన్‌తో పాటు మంత్రులు గొప్పగా ఊదరగొట్టుకున్నారు. కానీ.. పెట్టుబడులు పెట్టే విదేశీ కంపెనీలు ఏవి..? ఎవరా గ్లోబల్ ఇన్వస్టర్లు..? అనేది మాత్రం ఎక్కడా ఏపీ ప్రభుత్వం బయటపెట్టలేదు. కనీసం అధికారికంగా ప్రకటన కూడా చేయలేదు. అసలు లిస్టడ్ కంపెనీల పెట్టుబడి వివరాలపై ప్రభుత్వం మౌనం ఎందుకు పాటిస్తోందో అనేది ఎవరికీ తెలియని ప్రశ్న. సమ్మిట్ అయిపోయి గంటలు గడుస్తు?న్నా ఇంతవరకూ వచ్చిన పెట్టుబడులు ఏంటి..? ఎవరెవరికి ఎంవోయూలు ఇచ్చారు..? అనే విషయాలను అధికారికంగా ప్రకటించలేని పరిస్థితి. వైసీపీ శ్రేణులు సోషల్ మీడియాలో హడావుడి చేశాయో తప్ప.. మీడియాలో మాత్రం అసలు సమ్మిట్‌పై ఎక్కడా ప్రసారాల్లేవ్.

ప్లాన్ అట్టర్ ప్లాప్..!

సదస్సు నిర్వహిస్తున్నారంటే తర్వాత ఏం చేయాలి..? ఎలా ముందుకెళ్లాలి..? అనే దానికొక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలి. కానీ ఇది కొట్టొచ్చినట్లు కనిపించింది. మొదటి రోజే భోజనం, కిట్‌ల కోసం.. జనాలు తన్నుకున్న పరిస్థితిని మనం 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' వీడియోల్లో ఎక్స్‌క్లూజివ్‌గా చూశాం. ముఖ్యంగా కనీసం టాయిలెట్ల సౌకర్యం లేక డెలిగేట్స్ తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో సమ్మిట్ నుంచి తీవ్ర అసహనంతో కొందరు ఇన్వస్టర్లు బయటికొచ్చేసిన పరిస్థితి. పోనీ రెండోరోజు అయినా ఈ పరిస్థితుల్లో మార్పు వచ్చిందా అంటే అస్సలు రాలేదు. కనుచూపు మేరలో ఎక్కడా డెలిగేట్స్, ఇన్వస్టర్స్ కనిపించలేదు. మొదటి రోజు సమ్మిట్‌లో ఎక్కడ చూసినా జనం కనిపించినా రెండోరోజు డెలిగేట్స్, ఇన్వస్టర్స్ కనీసం స్థానికులు కూడా లేక వెలవెలబోయింది. దీంతో అప్పటికప్పుడు జనసంఖ్య కనిపించాలని సచివాలయ సిబ్బంది, ఎంబీఏ కాలేజీల నుంచి విద్యార్థులను తరలించారు. స్వయంగా ఈ విషయాన్ని విద్యార్థులే మీడియాకు చెప్పారు. తాము ఫలానా కాలేజీ నుంచి వచ్చామని చెబుతాన్నారు. రెండ్రోజుల సమ్మిట్ అట్టర్ ప్లాప్ అయ్యిందని విశ్లేషకులు చెబుతున్నారు.

జగన్‌లో తీవ్ర అసంతృప్తి..!

సమ్మిట్ మొదటిరోజు హడావుడిగా కనిపించిన సీఎం వైఎస్ జగన్.. శుక్రవారం సాయంత్రానికి ఢీలా పడిపోయారట. దీంతో కనీసం పెట్టుబడిదారులు, అతిథులు విశాఖలోని వీఎంఆర్డీఏ ఎంజీఎం పార్కులో ఏర్పాటు చేసిన ప్రత్యేక విందుకు కూడా హాజరుకాలేదు. 2వేల మందికి ఆతిథ్యం ఇచ్చేలా పార్కును ముస్తాబు చేసినప్పటికీ సాయంత్రానికి డెలిగేట్స్, ఇన్వస్టర్స్ ఎవరూ రాకపోవడంతో తీవ్ర అసంతృప్తికి లోనైన సీఎం జగన్ కూడా వెళ్లలేదని తెలుస్తోంది. మొత్తానికి చూస్తే.. పెట్టుబడులు రాక, వందల కోట్ల ప్రజాధనం వృథా అయిపోయిందనే మాటలు ఎక్కడ చూసినా వినిపిస్తున్నాయి. అయితే.. రెండ్రోజుల సమ్మిట్ సక్సెస్ అయ్యిందనే మాట వైసీపీ పార్టీ శ్రేణుల నుంచి రాకపోవడం గమనార్హం. అయితే జగన్ సొంత మీడియాలో మాత్రం ఆహా.. ఓహో అని మాటలు వినిపిస్తున్నాయా తప్పితే మరెక్కడా చలీచప్పుడు లేదు. ఈ మొత్తం వ్యవహారంపై అధికార పార్టీ నుంచి ఎలాంటి రియాక్షన్ వస్తుందో వేచి చూడాల్సిందే మరి.

టీటీడీ ధార్మిక కార్యక్రమాల సలహాదారు పదవిని తిరస్కరించిన చాగంటి

అమరావతి మార్చ్ 5 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);టీటీడీ ధార్మిక కార్యక్రమాల సలహాదారుగా ప్రముఖ ప్రవచన కర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావును నియమించాలని ఏపీ ప్రభుత్వం భావించిన సంగతి తెలిసిందే. ఈ పదవికి సంబంధించి రేపో మాపో అధికారికంగా ఉత్వర్వులు రావాల్సి ఉంది. ఈ వార్తలు బయటికొచ్చిన తర్వాత కుటుంబ సమేతంగా తాడేపల్లి సీఎం క్యాంప్ ఆఫీసుకు వెళ్లి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలిశారు. అయితే.. నెల రోజుల తర్వాత ఏం జరిగిందో ఏమో తెలియట్లేదు కానీ.. సడన్‌గా చాగంటి ఆ పదవిని తిరస్కరిస్తున్నట్లు ఓ ఇంటర్వ్యూ వేదికగా ప్రకటించారు. ఇందుకు సరైన కారణాలేంటనేది బయటికి రాలేదు కానీ.. టీటీడీకి సలహాలు ఇవ్వడానికి పదవులు అవసరం లేదని చెప్పుకొచ్చారు. తిరుమల వేంకటేశ్వరుడే తన ఊపిరని, ఆయన సేవ చేసుకోవడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని.. ఇందుకు పదవులు ఏమీ అక్కర్లేదని తెలిపారు. టీటీడీకి తన అవసరం ఎప్పుడొచ్చినా పరుగెత్తుకుంటూ వెళ్లి ముందుంటానని చెప్పి పదవిని తిరస్కరించారు.

ఎందుకో ఇలా..?

జనవరి- 21న హెచ్‌డీపీపీ కార్యనిర్వాహక కమిటీ టీటీడీ ధార్మిక కార్యక్రమాల సలహాదారుగా చాగంటిని నియమిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. కమిటీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డే మీడియా వేదికగా ప్రకటించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తుల కోసం టీటీడీ మూడేళ్లుగా వివిధ పారాయణాలు నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు వీలుగా ఈ నియామకం చేపట్టినట్లు అప్పట్లో వైవీ మీడియా ముఖంగా చెప్పారు. గ్రామీణ యువత భాగస్వామ్యంతో మారుమూల గ్రామాల్లో హిందూ ధర్మప్రచార కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని ఈ సలహాదారు పదవిని ఇస్తున్నట్లు వైవీ తెలిపారు. ఆ తర్వాత సీఎం జగన్‌ను కలవడం.. అంతా బాగానే ఉందనుకున్న టైమ్‌లో చాగంటి ఇలా తిరస్కరించడంతో ఏదో పెద్ద కారణమే ఉంటుందని తెలుస్తోంది.

హైకోర్టు ఇలా..!

వాస్తవానికి జగన్ సర్కార్‌లో వందలాది సలహాదారులు ఉన్నారు. ఈ సలహాదారుల విధానంపై ఏపీ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సందర్భాలు చాలానే ఉన్నాయి. అసలు ఈ సలహాదారులు అనేవారు ఏం చేస్తారు..? సలహాదారులకు జవాబుదారీతనం, బాధ్యత ఏముంటుంది..? అసలు వారికి నియమ నిబంధనలు, ఎలాంటి ప్రవర్తనా నియమావళి లేదు..? అని హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు కూడా చేసింది. అంతేకాదు.. సలహాదారుల ద్వారా ప్రభుత్వ సున్నిత సమాచారం కూడా బయటకు వెళ్లే ప్రమాదం ఉందంటూ ధర్మాసనం వ్యాఖ్యానించింది. రోడ్డుపై వెళ్లే వ్యక్తిని రాత్రికిరాత్రే సలహాదారుగా నియమించడానికి వీల్లేదని, సలహాదారుల నియామకంపై మార్గదర్శకాలు జారీ చేయబోమని హైకోర్టు కోర్టు వెల్లడించింది. వారికి సంబంధించి రాజ్యాంగబద్ధతను మాత్రమే తేలుస్తామని హైకోర్టు స్పష్టం చేసింది. ఇప్పుడింకా ఈ సలహాదారుల వ్యవహారం ఏపీ హైకోర్టులో విచారణ జరుగుతూనే ఉంది.

కారణమిదేనా..?

సలహాదారుల వ్యవహారంలో ఎప్పుడైనా కోర్టు నుంచి జగన్ సర్కార్‌కు ఎదురుదెబ్బ తగిలే అవకాశాలు మెండుగా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అప్పుడు తాను కూడా వెనక్కి తగ్గాల్సిన పరిస్థితి తప్పకుండా వస్తుందని ముందే గ్రహించి చాగంటి ఇలా చేశారని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున కథనాలు వస్తున్నాయి. అయితే.. ఆయన ఆశించిన రీతిలో టీటీడీలో విధి విధానాలు కూడా లేవని అందుకే చాగంటి తప్పుకున్నారనే ప్రచారమూ లేకపోలేదు. ఇందులో నిజానిజాలేంటో తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చేంతవరకూ వేచి చూడాల్సిందే మరి.

బికనీర్ ఐసీఏఆర్ జాతీయ పరిశోధనా కేంద్రంలో ఒంటె ఉత్పత్తుల ప్రాసెసింగ్, వినియోగం, శిక్షణా కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 6:బికనీర్ ఐసీఏఆర్ జాతీయ పరిశోధనా కేంద్రంలో ఒంటె ఉత్పత్తుల ప్రాసెసింగ్, వినియోగం, శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి శ్రీ పర్షోత్తం రూపాలారాజస్థాన్‌లోని బికనీర్ ఐసీఎంఆర్ జాతీయ పరిశోధనా కేంద్రంలో ఒంటె ఉత్పత్తుల ప్రాసెసింగ్, వినియోగం, శిక్షణా కేంద్రాన్ని కేంద్ర మత్స్య,పశు సంవర్ధక,పాడి పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పర్షోత్తం రూపాలా నిన్న ప్రారంభించారు. ప్రముఖ పరిశోధనా సంస్థగా గుర్తింపు పొందిన బికనీర్ ఐసీఏఆర్ కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలో వ్యవసాయ పరిశోధన,విద్యా విభాగం కింద స్వయం ప్రతిపత్తి గల సంస్థగా పనిచేస్తోంది. అతి తక్కువ వర్షపాతం, తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాల అభివృద్ధిలో ఒంటెలు కీలక పాత్ర పోషిస్తాయని గుర్తించిన ప్రభుత్వం 1984 జూలై 5 న ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్) ఆధ్వర్యంలో బికనీర్ వద్ద ఒంటెల ప్రాజెక్ట్ డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేసింది. ఈ సంస్థ 1995 సెప్టెంబర్ 20న నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఆన్ కేమెల్ (ఐఖీఅఅ)గా అప్‌గ్రేడ్ అయ్యింది.

బికనీర్ లోని ముఖ్యమైన పర్యాటక ప్రదేశాలలో ఒకటి గా గుర్తింపు పొందిన ఈ కేంద్రం పర్యాటక పుస్తకంలో చేర్చబడింది. ఎడారి పర్యావరణ వ్యవస్థ లో ఒంటెల అభివృద్ధి, ఒంటెలపై జరుగుతున్న పరిశోధన అంశాలను సందర్శకులకు తెలియజేయడానికి కేంద్రంలో ఒక మ్యూజియం ఏర్పాటయింది. ప్రతి సంవత్సరం దేశ, విదేశాలకు చెందిన వేలాది మంది పర్యాటకులు ఈ కేంద్రాన్ని సందర్శిస్తున్నారు.

ఈ రంగం కలిగి ఉన్న అపారమైన అవకాశాలను పరిగణనలోకి తీసుకొని కేంద్రంలో ఉత్పత్తుల ప్రాసెసింగ్, వినియోగం,శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు.

వర్యటనలో భాగంగా శ్రీ రూపాలా పశుపోషకులతో మాట్లాడారు. కేంద్రానికి చెందిన శాస్త్రవేత్తలు, నిపుణులతో వివిధ అంశాలపై చర్చలు జరిపిన కేంద్ర మంత్రి కేంద్రంలో సౌకర్యాలు పరిశీలించారు. ప్రాసెసింగ్ విభాగం ప్రాముఖ్యత, కేంద్రం వల్ల పశు పోషకులు కలిగే ప్రయోజనాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు.

శిక్షణ విభాగాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడిన శ్రీ పర్షోత్తమ్ రూపాల మాట్లాడుతూ, 'ఆర్థికాభివృద్ధి సాధన, గ్రామీణ ప్రాంత ప్రజల ఆదాయాన్ని పెంపొందించే అంశంలో పశుసంవర్ధక రంగం కీలక పాత్ర పోషిస్తోంది. పశుసంవర్ధక రంగం ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ఈ రంగంలో సాంకేతిక వినియోగం , ప్రభుత్వ పెట్టుబడులు , విధాన సంస్కరణలు ఎక్కువగా అమలు చేయాల్సిన అవసరం ఉంది. ఈ కేంద్రం వల్ల రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన పశుపోషణ వర్గాలకు మాత్రమే కాకుండా భారతదేశం మొత్తానికి ప్రయోజనం కలుగుతుంది' అని కేంద్ర మంత్రి అన్నారు. పశు సంవర్ధక రంగం అభివృద్ధి సాధించేలా చూడడానికి సంబంధిత వర్గాలతో కలిసి మంత్రిత్వ శాఖ పని చేస్తుందని ఆయన తెలిపారు.

శ్రీ పర్షోత్తం రూపాలా రాష్ట్రీయ సంస్కృతి మహోత్సవ్‌కు హాజరైన వివిధ ప్రముఖులతో మాట్లాడారు. ఇటువంటి కార్యక్రమాల వల్ల దేశ సంస్కృతి విశిష్టత తెలుస్తుందన్నారు. ఇటువంటి కార్యక్రమాలు వివిధ వర్గాలకు చెందిన ప్రజలను ఒక వేదికపైకి తీసుకు వచ్చి వారి భావాలు, అభిప్రాయాలు వెల్లడించడానికి అవకాశం కలిగించి ఆలోచనల మార్పిడికి వీలు కల్పిస్తామని శ్రీ రూపాలా అన్నారు.

కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ సంస్కృతి మహోత్సవ్‌ను కూడా మంత్రి సందర్శించారు. దేశ సంప్రదాయం, సంస్కృతి, వారసత్వం వైవిధ్యం తెలియజేసే విధంగా 2015లో కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ జాతీయ సాంస్కృతిక మహోత్సవ్ కార్యక్రమాన్ని రూపొందించింది. భారతీయ వారసత్వం సంరక్షణతో పాటు వారసత్వ విలువలను, ప్రోత్సహించడం, యువతరానికి వారసత్వ విలువలు తెలియజేసి వారికి స్ఫూర్తి కలిగించే విధంగా కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయి. భారతదేశంలో వివిధ ప్రాంతాలకు చెందిన సంప్రదాయ, గిరిజన, సాంప్రదాయ జానపద, ప్రసిద్ధ కళారూపాలను మహోత్సవ్ లో ప్రదర్శిస్తున్నారు. దాదాపు 1000 మందికి మించిన కళాకారులు, చేతి వృతి నిపుణులు (స్వయం-సహాయక బృందాలు, వ్యవస్థాపకులు) మహోత్సవ్ లో పాల్గొంటున్నారు. ఫడ్ పెయింటింగ్స్ (దేవ్‌నారాయణజీ, పాబూజీ, రామ్‌దేయోజీ మరియు కర్ణి మాత) ప్రత్యేక ప్రదర్శన మహోత్సవంలో ఆకర్షణీయంగా నిలిచింది.

రూ. 339.55 కోట్ల అంచనా వ్యయంతో దీమాపూర్ నుంచి కోహిమా (ప్యాకేజీ -2) వరకు 14,71 కిలోమీటర్ల 4లేన్ రహదారి నిర్మాణం

న్యూఢిల్లీ, మార్చి 6: దీమాపూర్ నుంచి కోహిమా (ప్యాకేజ్ -2) 14.71 కిలోమీటర్ల పొడవైన ఫోర్-లేన్ రహదారిని నిర్మాణం చేసేందుకు ప్రధానమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టును నాగాల్యాండ్‌లో చేపడుతున్నట్లు తన ట్వీట్‌ల పరంపరలో, కేంద్ర రహదారి రవాణా ఉ జాతీయ రహదారుల శాఖ మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ వెల్లడించారు. ఈ ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం రూ. 339.55 కోట్లని తెలిపారు.

రాష్ట్రంలో రాజధాని నగరాన్ని, ఇతర ప్రధాన వాణిజ్య కేంద్రాల మధ్య అనుసంధానతను మెరుగుపరచడం ద్వారా వృద్ధి, శ్రేయస్సు కోసం ప్రజల, సరుకు రవాణా వేగంగా జరిగేందుకు తోడ్పడడం ఈ ప్రాజెక్టు ప్రాథమిక లక్ష్యమని శ్రీ గడ్కరీ అన్నారు.

ప్రధానమంత్రి నాయకత్వంలో తక్కువ ఖర్చుతో కూడిన, స్థిరమైన రహదారి మౌలికసదుపాయాలను నమయపాలనతో, నాణ్యతా ప్రమాణాలపై రాజీ పడకుండా అందించడం తమ లక్ష్యమని మంత్రి తెలిపారు.

జగన్‌కు ఎంపీ రఘురామ ఓపెన్ ఛాలెంజ్

హైదరాబాద్ మార్చ్ 5 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పై వైసీపీ రెబల్ ఎంపీ రఘురామకృష్ణ రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో బూత్ క్యాప్చరింగ్ లాగా పెట్టుబడుల పేరుతో స్థల క్యాప్చరింగ్ చేస్తున్నారని ఆరోపించారు. అభివృద్ధి కోసం 13 లక్షల కోట్ల పెట్టుబడులు రావాలంటే మళ్లీ తానే ఎన్నికల్లో గెలవాలని జగన్ అనుకుంటున్నారని రాఘురామ ఎద్దేవా చేశారు. ఎన్నికలు వచ్చేలోపు కొన్నిటికైనా స్థలాలు ఇస్తారని.. స్థలయజ్ఞం అయితే కచ్చితంగా జరుగుతుందని ఎంపీ అన్నారు. జగన్‌కు తాను ఓపెన్‌గా ఛాలెంజ్ చేస్తున్నానని ఎంపీ రఘు రామకృష్ణరాజు స్పష్టం చేశారు. స్థలం ఎక్కడ సృష్టించి పెట్టుబడిదారులకు ఇవ్వగలరని, తమ దగ్గర ఉన్నది 45 వేల ఎకరాలైతే.. 7 లక్షల ఎకరాలు ఎలా సృష్టించి ఇస్తారని రఘురామ ప్రశ్నించారు. తమ దగ్గర ఉన్న 45 వేల ఎకరాల భూమిని లక్షల మెగావాట్లకు ఎలా సర్దుతారని ప్రశ్నించారు. 'ఒకవేళ స్థలం సేకరించాలంటే.. ఎవరి స్థలాలు తీసుకొని.. ఎవరికి ఇస్తారు' అని ఎంపీ ప్రశ్నించారు. 450 కోట్లు స్మాల్ అండ్ మీడియమ్ స్కేల్ ఇండస్ట్రీస్‌కు సబ్సిడీ రూపంలో ఇవ్వాల్సింది 2 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉందని ఎంపీ రఘురామ ఎద్దేవా చేశారు.

రామగోపాల్ రెడ్డిని గెలిపించండి.. కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి

అమరావతి, మార్చి 6:తెలుగుదేశం పార్టీ బలపరచిన పచ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు సోమిశేట్టి వెంకటేశ్వర్లు, మంత్రాలయం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్ చార్జ్ పాలకుర్తి తిక్కారెడ్డి కోరారు. సోమవారం వారు తెలుగుదేశం పార్టీ మంత్రాలయం నియోజకవర్గం పరిశీలకులు రామాంజినమ్మ, ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు భీమవరం నాగేశ్వరరావుతో కలిసి కోసిగిలో మండల కన్వీనర్ జ్ఞానేష్ అధ్యక్షతన తెలుగుదేశం పార్టీ బలపరచిన పచ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని, ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్తల కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రాడ్యుయేట్ ఓటర్లతో మాట్లాడుతూ? వైయస్సార్ ప్రభుత్వం యువతకు అనేక హామీలు ఇచ్చి, ఒక్క ఉద్యోగం గాని పరిశ్రమలు గాని ఇవ్వకుండా మోసం చేసిందని, ఈనెల 13వ తేదీన జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ తెలుగుదేశం పార్టీ బలపరచిన పచ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వారన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే యువతకు ఉద్యోగం, ఉపాధి అవకాశాలు ఎక్కువగా వస్తాయన్నారు.

తోషఖానా కేసు లోపాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అరెస్టయ్యే అవకాశం!

ఇస్లామాబాద్ మార్చ్ 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్) : పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ తోషఖానా కేసులో అరెస్టయ్యే అవకాశం ఉంది. పోలీసులు నాన్-బెయిల్‌బుల్ అరెస్టు వారెంట్‌తో లాహోర్‌లోని జమాన్ పార్క్ నివాసానికి ఆదివారంనాడు చేరుకోడంతో పెద్దఎత్తున ఇమ్రాన్ మద్దతుదారులు, పాకిస్థాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ కార్యకర్తలు అక్కడకు చేరుకున్నారు. దీంతో ఇమ్రాన్ నివాసం వెలుపల హైడ్రామా నెలకొంది. ఇమ్రాన్ మద్దతుదారుల నినాదులు, నిరసనలతో పోలీసులు ముందుకు వెళ్లలేకపోయారని వార్తలు వచ్చాయి.తోషఖానా కేసు విచారణకు ఇమ్రాన్ పదేపదే గైర్హాజరు అవుతుండటంతో ఆయనకు కోర్టు అరెస్టు వారెంట్లు జారీ చేసింది. లీగల్ విధివిధానాలు పూర్తి చేసి ఇమ్రాన్‌ను అరెస్టు చేస్తారని తెలుస్తోంది. కాగా, అతికష్టం మీద ఇమ్రాన్ నివాసంలోకి ఒక సీనియర్ అధికారి అడుగుపెట్టారని, అయితే అక్కడ ఇమ్రాన్ జాడ కనిపించలేదని పోలీసు వర్గాల సమాచారం. అరెస్టు నుంచి తప్పించుకునే క్రమంలోనే ఆయన తన నివాసానికి దూరంగా ఉన్నారని వారు అనుమానిస్తున్నారు.

కాగా, ఇమ్రాన్‌ను అరెస్టు చేసే ఆలోచన ఏదీ లేదని పోలీసులు చెప్పినట్టు స్థానిక మీడియా తెలిపింది. కోర్టు ఉత్తర్వుల మేరకే తాము లాహోర్ వచ్చామని, ఆయనను తమ ప్రొటక్షన్ లోకి తీసుకునేందుకు ఇస్లామాబాద్ తరలిస్తామని ఇస్లామాబాద్ పోలీసులు ఒక ట్వీట్‌లో తెలిపారు. కోర్టు ఉత్తర్వులు అమలు కానీయకుండా అడ్డుకునే వారిపై లీగల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తీవ్ర పరిణామాలు తప్పవన్న మాజీ మంత్రి

మరోవైపు, ఇమ్రాన్ ఖాన్‌కు వ్యతిరేకంగా ఎలాంటి చర్యలు తీసుకున్నా దేశ పరిస్థితి మరింత విషమిస్తుందని పాకిస్థాన్ మాజీ మంత్రి ఫవద్ చౌదరి... షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అసలే సంక్షోభంలో ఉన్న దేశాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టకుండా సున్నితంగా వ్యవహరించాలని అన్నారు. ఇమ్రాన్ ఖాన్ ప్రాణాలకు ముప్పు ఉందని, ఆయనను టార్గెట్ చేసుకునే కుట్ర జరుగుతోందని పాక్ మాజీ విదేశాంగ మంత్రి మహ్మద్ ఖురేషి మరో ప్రకటనలో పేర్కొన్నారు.

తోషఖానా కేసు ఏమిటి?

ఇమ్రాన్ ఖాన్ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో దేశ విదేశాలలో సేకరించిన ఖరీదైన వస్తువులు, కానుకలను నిబంధనల ప్రకారం తోషఖానాను తరలించారు. అవే వస్తువులను తోషఖానా నుంచి తక్కువ ధరకు కొనేసి, ఎక్కువ ధరకు అమ్ముకుని ఆయన సొమ్ము చేసుకున్నట్టు ఆరోపణలున్నాయి. దీనిపై ఎన్నికల సంఘం ఆయనపై ఐదేళ్ల పాటు అనర్హత వేటు వేసింది. దీంతో జాతీయ అసెంబ్లీకి పోటీ చేసే అవకాశాన్ని ఆయన కోల్పోయారు. తోషఖానా రిఫరెన్స్‌లో తప్పుడు స్టేట్‌మెంట్ ఇచ్చినందుకు ఈసీ ఈ చర్యలు తీసుకుంది. ప్రస్తుతం తోషఖానా కేసుపై కోర్టులో విచారణ జరుగుతోంది.

వల్లార్‌పాదంను కలమస్సెరీతో అనుసంధానం చేసేందుకు రూ. 571 కోట్లతో కేరళలో 4-లేన్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్) అభివృద్ధి - శ్రీ నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ, మార్చి 6:దేశ ఆర్థిక వృద్ధిలో తీర ప్రాంత, పోర్ట్ (రేవు) అనుసంధానత మౌలికసదుపాయాలు కీలక పాత్ర పోషిస్తాయని కేంద్ర మంత్రి రహదారి రవాణా, హైవేల మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ అన్నారు. తన ట్వీట్‌ల పరంపరలో, కేరళలో ఐసిటిటి (ఇంటర్నేషనల్ కంటైనర్ ట్రాన్స్‌షిప్‌మెంట్ టెర్మినల్) వల్లార్‌పాదంను కలమస్సెరీని అనుసంధానం చేస్తూ మొత్తం రూ. 571 కోట్లతో 4-లేన్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్)ని అభివృద్ధి చేసినట్టు ఆయన వెల్లడించారు.

ఈ ప్రాజెక్టులో కొచ్చిన వద్ద అరేబియా సముద్ర పృష్ఠజలాల (బ్యాక్‌వాటర్స్)లో బాగుచేసిన భూమి ద్వారా 8.721 కిమీల రేవు అనుసంధానత రహదారి నిర్మాణం ఉందని మంత్రి తెలిపారు. కొచ్చిన్ రేవుకు సరుకు రవాణా కోసం నార్త్-సౌత్ (ఆగ్నేయ) కారిడార్‌ను ఈ హైవే అనుసంధానం చేస్తుందని, తద్వారా సరుకు రవాణాను సులభతరం చేస్తుందని ఆయన అన్నారు.

అంతేకాకుండా, తీర ప్రాంతంలో ఉన్న ఎనిమిది గ్రామాల ప్రజల చలనశీలతను ఈ హైవే పెంచుతుందని, ఈ ప్రాంత సామాజిక- ఆర్థిక అభివృద్ధికి ప్రముఖంగా దోహదం చేసిందన్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ నాయకత్వంలో మన పౌరుల అవసరానికి ఉపయోగపడే సమయానుకూలమైన, తక్కువ ఖర్చుతో కూడిన, అధిక నాణ్యత కలిగిన స్థిరమైన రహదారి మౌలిక సదుపాయాలను అందించడం తమ తిరుగులేని నిబద్ధత తమదని శ్రీ గడ్కరీ అన్నారు.

శిఖరం ఆర్ట్ థియేటర్స్
హైదరాబాద్ Regd. No. 416/18
50 వంశీ ఆర్ట్ థియేటర్స్ ఇంటర్నేషనల్
ఆరాధన కల్చరల్ ఆసోషియేషన్ కథక్ కళాక్షేత్ర
కళానిలయం సాంస్కృతిక సంఘ సేవా సంస్థ
శ్రీ సచ్చిదానంద కళాపీఠం సంయుక్తంగా నిర్వహించు
లలితగేయ కళానిధి, సహస్రాధిక లలిత గీత రచయిత, రసమయి వ్యవస్థాపక అధ్యక్షులు
బాలబంధు డా॥ యం.కె. రాము గారి
జన్మదినోత్సవ వేడుక - లలితగీత వైభవం
తేది: 07-03-2023 మంగళవారం సా॥ 6.00 గంటలకు
వేదిక: శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక, చిక్కడపల్లి, హైదరాబాద్.
ముఖ్య అతిథి: డా॥ సముద్రాల వేణుగోపాల చారి గారు టి.యస్.ఐ.డి.సి. చైర్మన్
సభాప్రారంభకులు: డా॥ పాలకుర్తి మధుసూదనరావు గారు దూరదర్శన్ పూర్వ సంచాలకులు, ఎస్.వి.బి.సి. పూర్వ సి.ఇ.ఒ. టి.టి.డి.
సభాధ్యక్షులు: ఆచార్య శ్రీ బి. గౌరి శంకర్ గారు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ర

చార్ ధామ్ యాత్రికుల ఆరోగ్యం, భద్రత కోసం మూడు-అంచెల ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలి: డా.మన్‌సుఖ్ మాండవీయ

న్యూఢిల్లీ, మార్చి 6:"దేశవ్యాప్తంగా చార్ ధామ్ యాత్ర కోసం తరలివెళ్లే యాత్రికుల కోసం కేంద్ర ప్రభుత్వం త్వరలో బలమైన ఆరోగ్య సంరక్షణ ఏర్పాట్లు, అత్యవసర వైద్య సేవల మౌలిక సదుపాయాలను సృష్టించబోతోంది. వైద్య పరంగా, యాత్రికుల ప్రయాణ సమయంలో వారికి మూడు అంచెల సౌకర్యం అందుబాటులోకి వస్తుంది''. ఉత్తరాఖండ్ ఆరోగ్య మంత్రి డా.ధన్‌సింగ్ రావత్‌తో సమావేశం తర్వాత, ఇవాళ, కేంద్ర ఆరోగ్య ఉ కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డా.మన్‌సుఖ్ మాండవియా ఈ విషయాన్ని తెలిపారు. కేంద్ర మంత్రితో సమావేశమైన డా.ధన్‌సింగ్ రావత్, ప్రతి సంవత్సరం చార్ ధామ్ యాత్రను చేపట్టే లక్షలాది మంది యాత్రికుల ఆరోగ్య సంరక్షణ కోసం అత్యవసర మౌలిక సదుపాయాల ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం నుంచి సహాయాన్ని అభ్యర్థించారు. కష్టతరమైన మార్గంలో యాత్రికులు ఎదుర్కొంటున్న ఆరోగ్య సవాళ్లను, గుండె పోటు వంటి ఆరోగ్య అత్యవసర పరిస్థితుల కారణంగా గత కొన్ని నెలలుగా చనిపోయిన యాత్రికుల సంఖ్యను ఆయన కేంద్ర ఆరోగ్య మంత్రికి తెలిపారు. ఇలా మరణించిన వారిలో చాలామందిలో ఇతర అనారోగ్యాలు కూడా ఉన్నాయని వివరించారు.

కేంద్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహాయం అందిస్తామని డా.మాండవీయ హామీ ఇచ్చారు. "యాత్రికుల కోసం సాధ్యమైనంత ఉత్తమ ఆరోగ్య సంరక్షణ, అత్యవసర వైద్య సేవల మౌలిక సదుపాయాలు ఏర్పాటవుతాయి'' అని చెప్పారు. ఆసుపత్రికి వెళ్లే మార్గంలోనే గుండెపోటు చికిత్స సహా ఇతర చికిత్సలు ప్రారంభమయ్యేలా చూడడానికి అధునాతన అంబులెన్స్‌లు, స్ట్రోక్ వ్యాన్‌లతో బలమైన నెట్‌వర్క్‌ను సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ అంబులెన్స్‌లను యాత్ర మార్గంలోని వివిధ ప్రదేశాల్లో ఉంచుతామని తెలిపారు. ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా, దేశవ్యాప్తంగా ఉన్న వైద్య కళాశాలల నుంచి పీజీ విద్యార్థులను క్షేత్ర స్థాయిలో నియమించాలని కూడా ప్రతిపాదించారు. "పీజీ విద్యార్థుల నైపుణ్యం, సామర్థ్యాన్ని పెంచే కార్యక్రమంగానూ ఈ అనుభవం ఉపయోగపడుతుంది'' అని డా.మాండవీయ వెల్లడించారు.

యాత్ర సాగే ఎత్తయిన ప్రదేశాల్లో అత్యవసర మందులను అందించడానికి డ్రోన్లను కూడా ఉపయోగిస్తారు. ఈశాన్య ప్రాంతంలో కొవిడ్-19 వ్యాక్సిన్‌ల రవాణా కోసం డ్రోన్‌లను విజయవంతంగా ఉపయోగించారు. చార్ ధామ్ క్షేత్రాలయిన కేదార్‌నాథ్, బద్రీనాథ్, గంగోత్రి, యమునోత్రి గర్వాల్ హిమాలయాల్లో 10,000 అడుగుల ఎత్తులో ఉన్నాయి. ఇటీవల, ఔషధాల పంపిణీ కోసం ఎయిమ్స్ రిషికేష్ డ్రోన్ సేవను ప్రారంభించింది. "ఎయిమ్స్ రిషికేశ్, దూన్ వైద్య కళాశాల, శ్రీనగర్ వైద్య కళాశాలా ప్రాంతీయ కేంద్రాలుగా నైపుణ్య వైద్య సేవలను అందిస్తాయి. యాత్రికుల ఆరోగ్యానికి సంపూర్ణ వైద్య భరోసా లభిస్తుంది" అని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి తెలిపారు.

వాతావరణ పరిస్థితులు, ఆరోగ్య సౌకర్యాలున్న ప్రదేశం, కాల్ సెంటర్ నంబర్లు, యాత్రకు ముందు వైద్య పరీక్షలు, అత్యవసర వైద్య సాయం మొదలైన వాటిని గురించి యాత్రికులకు తెలియజేసే వెబ్‌సైట్‌లు/పోర్టళ్ల వంటి పౌర-స్నేహపూర్వక సమాచార పంపిణీ, అవగాహన కార్యక్రమాల ద్వారా ఈ ప్రణాళికలను అమలు చేస్తారు.

మహిళల రక్షణ కోసం ప్రతి ఒక్క మాహిళ పోరాటం చేయాలి

-హేల్ టాటా మణీ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ మెర్సీ జ్యోతీ

రాజమండ్రి 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);రాజమండ్రి లోని నాటక రంగం, పాటల రంగం సంస్థ ఆద్వర్యం లో ఉమెన్స్ డే సెలబ్రేషన్స్ ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా హేల్ టాటా మణీ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ మెర్సీ జ్యోతీ మాట్లాడుతూ నేడు సమాజం లో స్త్రీలకు రక్షణ లేకుండా పోయిందని మహిళల రక్షణ కోసం వారి హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్క మాహిల పోరాటం చేయాలని పిలుపు నిచ్చారు.లేనియడల మనం ఎన్ని మహిళా దినోత్సవాలు జరుపుకున్న వ్యర్థామి నన్నారు.పోరాటాల ద్వారానే మన హక్కులను కాపాడు కోవాలన్నారు. ఇలాంటి ప్రోగ్రాం ను స్త్రీల ఎదుగుదలకు ఉపయోగకరం గా ఉండటానికి దోహద పడగవన్నారు. అందరం కలిసి ఆకలి అనే అడ్డు గోడలను కూల్చుదామన్నారు. ఈ సందర్భంగా నాటక రంగం సంస్థ అధ్యక్షులు యువి రత్నం మెర్సీ జ్యోతి ని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమం లో జగదాంబ , కల్పన రెడ్డి , ప్రియాంక నిస్సీ , లక్ష్మి , మోర సత్యనారాయణ కాకుమాను ప్రవీణ్ కుమార్ ,పోలంకి ఉష రాణి, పాలంకి జగదీశ్ కుమార్,ఎస్ కే ప్రవీణ్ ,సునీతా రెడ్డి తదితరులుయ్ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ పాలనలో మహిళలకు కరువైన రక్షణ

-బీజేపీ నేత బండి సంజయ్ ధ్వజం

హైదరాబాద్ మార్చ్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: సీఎం కేసీఆర్ పాలనలో మహిళలకు రక్షణ కరువైందని బీజేపీ నేత బండి సంజయ్ ధ్వజమెత్తారు. మెడికో ప్రీతి కేసులో నిందితులను తప్పించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. శవానికి ట్రీట్‌మెంట్ చేస్తూ సినిమా చూపించారని విమర్శించారు. ప్రీతి సెల్‌ఫోన్‌లోని డేటా మొత్తం డిలీట్ చేశారని, ఆమె ఎలా చనిపోయిందో ఇప్పటివరకూ క్లారిటీ లేదన్నారు. సిట్టింగ్ జడ్జితో విచారణ జరపడానికి కేసీఆర్‌కు అభ్యంతరమేంటి? అని ప్రశ్నించారు. తెలంగాణ సాధన లక్ష్యం నెరవేరాలన్నా.. నేరాలు అదుపులోకి రావాలన్నా బీజేపీ తోనే సాధ్యమని సంజయ్ స్పష్టం చేశారు.

పోలీసులకు సవాల్‌గా మారిన ప్రీతి కేసు

ప్రీతి మృతి కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. ఎంజీఎం ఆస్పత్రిలో ఆమె అపస్మారక స్థితిలో పడి ఉన్నచోట.. మిడాజోలం, పెంటానోల్ అనే మత్తు ఇంజెక్షన్ వయల్స్ పడి ఉన్నట్టు పోలీసుల దర్యాప్తులో తేలిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆమె శరీరంలో ఆ మందుల అవశేషాలతో పాటు, వేరేవైనా విషాలు ఉన్నాయా తెలుసుకునేందుకు హైదరాబాద్ డాక్టర్లు నమూనాలు సేకరించి టాక్సికాలజీ పరీక్షకు పంపారు. పదిరోజుల తర్వాత.. ఆ నివేదిక ఆదివారం వరంగల్ పోలీసులకు చేరింది. ప్రీతి శరీరం నుంచి సేకరించిన నమూనాల్లో ఎలాంటి రసాయనాలూ కనిపించలేదని ఆ నివేదిక పేర్కొన్నట్టు సమాచారం. దీంతో ప్రీతిది హత్యా? ఆత్మహత్యా? అనే విషయంలో ఎలాంటి నిర్ధారణకూ రాలేని పరిస్థితి. ఆమె తల్లిదండ్రులేమో.. తమ కుమార్తె హత్యకు గురైందని ఆరోపిస్తున్నారు.

స్టాన్ ఫోర్డ్ విశ్వవిద్యాలయం, ఇని స్టిట్యూట్ ఫర్ కాంపిటీటివ్ నెస్ వర్కింగ్ పేపర్‌ను విడుదల చేసిన కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ

న్యూఢిల్లీ, మార్చి 6:2020 జనవరిలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) కోవిడ్ -19ను ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా ప్రకటించడానికి చాలా ముందు, మహమ్మారి నిర్వహణ సంబంధిత వివిధ అంశాలపై అంకితభావంతో దృష్టి సారించే ప్రక్రియలు నిర్మాణాలు రూపొందించబడ్డాయి. గౌరవ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం కోవిడ్ -19ను సమర్థవంతంగా నిర్వహించడానికి ఒక సమగ్ర ప్రతిస్పందన వ్యూహాన్ని అవలంబించడం ద్వారా 'హోల్ ఆఫ్ గవర్నమెంట్' - 'హోల్ ఆఫ్ సొసైటీ' విధానాన్ని క్రియాశీలంగా, ముందస్తుగా, గ్రేడింగ్ పద్ధతిలో అవలంబించింది. వ్యాక్సినేషన్ వల్ల ఆర్థిక ప్రభావం, సంబంధిత అంశాలపై 'ది ఇండియా డైలాగ్' సెషన్ లో వర్చువల్ గా ప్రసంగించిన కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ ఈ విషయాన్ని వెల్లడించారు. స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీకి చెందిన ఇన్ స్టిట్యూట్ ఫర్ కాంపిటీటివ్ నెస్ , యూఎస్ -ఆసియా టెక్నాలజీ మేనేజ్ మెంట్ సెంటర్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి.

హీలింగ్ ది ఎకానమీ: భారత వ్యాక్సినేషన్, సంబంధిత అంశాలపై ఆర్థిక ప్రభావాన్ని అంచనా వేయడం' పేరుతో స్టాన్ ఫోర్డ్ విశ్వవిద్యాలయం, ఇని స్టిట్యూట్ ఫర్ కాంపిటీటివ్ నెస్‌రూపొందించిన వర్కింగ్ పేపర్ ను కూడా శ్రీ మాండవీయ ఈ సందర్భంగా విడుదల చేశారు.

వైరస్ వ్యాప్తిని నిరోధించే చర్యగా కంటైన్మెంట్ పాత్రను ఈ పత్రం చర్చిస్తుంది. వైరస్ ను కట్టడి చేయడంలో టాప్-డౌన్ విధానానికి భిన్నంగా, బాటమ్ -అప్ విధానం కీలకమని ఇది హైలైట్ చేస్తుంది. కాంటాక్ట్ ట్రేసింగ్, మాస్ టెస్టింగ్, హోం క్వారంటైన్, అవసరమైన వైద్య పరికరాల పంపిణీ, ఆరోగ్య మౌలిక సదుపాయాలను పునరుద్ధరించడం, కేంద్ర, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో భాగస్వాముల మధ్య నిరంతర సమన్వయం వంటి క్షేత్రస్థాయిలో పటిష్టమైన చర్యలు వైరస్ వ్యాప్తిని అరికట్టడమే కాకుండా ఆరోగ్య మౌలిక సదుపాయాలను పెంచడంలో సహాయపడ్డాయని స్టాన్ ఫోర్డ్ నివేదిక పేర్కొంది.

కంటైన్మెంట్, రిలీఫ్ ప్యాకేజీ, వ్యాక్సిన్ అడ్మినిస్ట్రేషన్ అనే మూడు అంశాలను ఇది వివరిస్తుంది. కొవిడ్-19 వ్యాప్తిని అరికట్టడం, జీవనోపాధిని కొనసాగించడం, వైరస్ కు వ్యతిరేకంగా రోగనిరోధక శక్తిని పెంపొందించడం ద్వారా ప్రాణాలను కాపాడటంలో, ఆర్థిక కార్యకలాపాలను నిర్ధారించడంలో ఈ మూడు చర్యలు కీలకమని పేర్కొంది.

మునుపెన్నడూ లేని స్థాయిలో దేశవ్యాప్త వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టడం ద్వారా భారతదేశం 3.4 మిలియన్లకు పైగా ప్రాణాలను కాపాడగలిగిందని వర్కింగ్ పేపర్ పేర్కొంది. వర్కింగ్ పేపర్ ప్రకారం, వ్యాక్సినేషన్ ప్రచారం ఎల్లప్పుడూ ప్రాణాలను కాపాడటంపైనే సాగింది.కాగా, ఇది 18.3 బిలియన్ అమెరికన్ డాలర్ల నష్టాన్ని నివారించడం ద్వారా సానుకూల ఆర్థిక ప్రభావాన్ని ఇచ్చింది. వ్యాక్సినేషన్ క్యాంపెయిన్ ఖర్చును పరిగణనలోకి తీసుకున్న తర్వాత దేశానికి 15.42 బిలియన్ డాలర్ల నికర ప్రయోజనం లభించింది.

దేశ ప్రజల ప్రయత్నాలను ప్రశంసించిన డాక్టర్ మాండవీయ, కొవిడ్ పై పోరాటంలో ప్రభుత్వానికి, ఇతర భాగస్వాములకు సహకరించిన పౌరులకు ఈ విజయంలో ఎక్కువ భాగం ఘనత ను ఇచ్చారు. ప్రధాని ముందస్తు లాక్డౌన్ నిర్ణయాన్ని కీలక మలుపుగా అభివర్ణిస్తూ,

కోవిడ్-19ను ఎదుర్కోవడానికి టెస్ట్- ట్రాక్ - ట్రీట్ - వ్యాక్సినేషన్ - కోవిడ్ సముచిత ప్రవర్తన (క్యాబ్) అమలుకు కట్టుబడి ఉండటం, వేగవంతమైన ,బలమైన సంస్థాగత ప్రతిస్పందనను అందించడం అనే ఐదు అంచెల వ్యూహంలో కమ్యూనిటీ ప్రతిస్పందనను ఉపయోగించుకోవడానికి ఇది ప్రభుత్వానికి సహాయపడిందని డాక్టర్ మాండవీయ పేర్కొన్నారు.

భాగస్వాముల మధ్య బలమైన సహకారం అవసరాన్ని పునరుద్ఘాటిస్తూ,కోవిడ్ సంబంధిత పడకలు, మందులు, లాజిస్టిక్స్ అంటే ఎన్ -95, పిపిఇ కిట్లు, మెడికల్ ఆక్సిజన్ పరంగా ఆరోగ్య మౌలిక సదుపాయాలను పెంచడం, సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ లలో మానవ వనరులను పెంచడం ,ఈ సంజీవని టెలిమెడిసిన్ సర్వీస్, ఆరోగ్య సేతు, కోవిడ్ -19 ఇండియా పోర్టల్ వంటి డిజిటల్ పరిష్కారాలను మోహరించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని డాక్టర్ మాండవీయ చెప్పారు. నిర్వహించిన 917.8 మిలియన్ల పరీక్షల కంటే అపూర్వమైన రేటుతో టెస్టింగ్(న్పా)స్ట్రక్చర్ ను పెంచడానికి సమాన ప్రాధాన్యత ఇచ్చినట్టు, వైరస్ వేరియంట్లను పర్యవేక్షించడానికి జీనోమిక్ సర్వైలెన్స్ కోసం 52 ల్యాబ్ల నెట్వర్క్ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

డాక్టర్ మాండవీయ మాట్లాడుతూ, ''ఈ వేగాన్ని పెంచుకుంటూ, భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద వ్యాక్సినేషన్ డ్రైవ్ ను ప్రారంభించింది, 97% మొదటి మోతాదు , 90% రెండవ మోతాదు కవరేజీని పొందింది, అర్హులైన లబ్ధిదారులకు మొత్తం 2.2 బిలియన్ మోతాదులను ఇచ్చింది. ఈ డ్రైవ్ అందరికీ సమానమైన కవరేజీపై దృష్టి సారించింది, కాబట్టి పౌరులందరికీ వ్యాక్సిన్లను ఉచితంగా అందించారు. 'హర్ ఘర్ దస్తక్', మొబైల్ వ్యాక్సినేషన్ బృందాలు, కో-విన్ వ్యాక్సిన్ మేనేజ్మెంట్ ప్లాట్ఫామ్ ప్రారంభం వంటి ప్రచారాలు, డిజిటల్ సాధనాలను చివరి మైలు డెలివరీని నిర్ధారించడానికి ఉపయోగించుకున్నారు. లక్ష్యంగా ఉన్న సమాచారం, విద్య కమ్యూనికేషన్ ద్వారా సమాజంలో భయాలను పోగొట్టడం, తప్పుడు సమాచారం ఇన్ఫోడెమిక్‌లను సమర్థంగా నిర్వహించడం మహమ్మారి నిర్వహణ విజయానికి దోహదపడిన అంశాలని కేంద్ర మంత్రి వివరించారు.

వ్యాక్సినేషన్ వల్ల కలిగే ప్రయోజనాలు దాని ఖర్చు కంటే ఎక్కువ ఉండడం విశేషమని నివేదిక తెలిపింది. టీకాను కేవలం ఆరోగ్య జోక్యంగా గాకుండా స్థూల ఆర్థిక స్థిరీకరణ సూచికగా పరిగణించాలని సూచించింది. "వ్యాక్సినేషన్ ద్వారా రక్షించబడిన ప్రాణాల మొత్తం జీవితకాల సంపాదన (వర్కింగ్ ఏజ్ గ్రూప్) 21.5 బిలియన్ డాలర్లకు చేరుకుంది" అని వర్కింగ్ పేపర్ హైలైట్ చేసింది. స్టాన్ ఫోర్డ్ విశ్వవిద్యాలయం నివేదిక ప్రకారం, "ఈ అన్ని వ్యాక్సిన్ల (కోవాగ్జిన్ అండ్ కోవిషీల్డ్) అభివృద్ధి వైరస్ హానికరమైన దాడితో పోరాడటానికి దేశానికి సహాయపడింది పెద్ద సంఖ్యలో ప్రజలకు టీకాలు వేయడమే కాకుండా ఆరోగ్య సంరక్షణ వ్యవస్థపై భారాన్ని కూడా తగ్గించింది".

పౌరుల కోసం ఉపశమన ప్యాకేజీలను ప్రశంసించిన డాక్టర్ మాండవీయ, "కేంద్ర, రాష్ట్ర ,జిల్లా స్థాయిలలో భాగస్వాముల మధ్య నిరంతర సమన్వయం కోవిడ్ -19 ప్రతికూల ప్రభావాలను తగ్గించడంలో సహాయపడటమే కాకుండా ఆర్థిక కార్యకలాపాలకు ఉత్తేజాన్ని ఇచ్చింది" అన్నారు. బలహీన వర్గాలు, వృద్ధులు, రైతులు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు), మహిళా పారిశ్రామికవేత్తలు తదితరుల సంక్షేమ అవసరాలను తీర్చడంతో పాటు వారి జీవనోపాధికి తోడ్పాటును అందించేందుకు ప్రభుత్వం ఈ ప్యాకేజీని ప్రకటించింది. ఎంఎస్ఎంఇ రంగానికి మద్దతు ఇవ్వడానికి ప్రారంభించిన పథకాల సహాయంతో, 10.28 మిలియన్ల ఎంఎస్ఎంఇ లకు సహాయం అందించామని, ఫలితంగా 100.26 బిలియన్ డాలర్ల ఆర్థిక ప్రభావం పడిందని, ఇది జిడిపిలో 4.90% అని ఆయన అన్నారు.

మహమ్మారి సమయంలో ఆహార భద్రత కు భరోసా కల్పించినట్లు డాక్టర్ మాండవీయ పేర్కొంటూ, ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన (పిఎంజికెఎవై) వంటి కార్యక్రమాల గురించి తెలియజేశారు, వీటిని ఇది వర్కింగ్ పేపర్ లో కూడా ప్రముఖంగా ప్రస్తావించారు. ఎవరూ ఆకలితో ఉండకుండా చూడటంపై ప్రభుత్వం దృష్టి సారించిందని, 800 మిలియన్ల మందికి ఉచిత ఆహార ధాన్యాలను పంపిణీ చేసిందని, దీని ఫలితంగా సుమారు 26.24 బిలియన్ అమెరికన్ డాలర్ల ఆర్థిక ప్రభావం పడిందని నివేదిక తెలిపింది. అదనంగా, పిఎం గరీబ్ కళ్యాణ్ రోజ్గార్ అభియాన్ ప్రారంభం వలస కార్మికులకు తక్షణ ఉపాధి ,జీవనోపాధి అవకాశాలను అందించడంలో కూడా సహాయపడింది.

ఈ పథకం ద్వారా 4 మిలియన్ల మంది లబ్ధిదారులకు ఉపాధి లభించింది, దీని ఫలితంగా మొత్తం 4.81 బిలియన్ అమెరికన్ డాలర్ల ఆర్థిక ప్రభావం పడింది. ఇది జీవనోపాధి అవకాశాలను కల్పించింది. పౌరులకు ఆర్థిక బఫర్ ను సృష్టించింది అని వర్కింగ్ పేపర్ అభిప్రాయపడింది.

డాక్టర్ మాండవీయ ఈ నివేదిక వెనుక ఉన్న మొత్తం పరిశోధకులు ,విషయ నిపుణుల కృషిని ప్రశంసించారు .కోవిడ్ -19 సంక్షోభానికి వ్యతిరేకంగా మన కీలక వ్యూహాలు తెచ్చిన ఆర్థిక ప్రభావం పరిమాణాన్ని అర్థం చేసుకోవడానికి ప్రతి ఒక్కరూ దీనిని చదవాలని కోరారు. భవిష్యత్తులో వచ్చే మహమ్మారులకు వ్యతిరేకంగా భాగస్వాములు సాయుధం కావడానికి ఇది సహాయపడుతుంది.

కేంద్ర ఆరోగ్య కార్యదర్శి శ్రీ రాజేష్ భూషణ్, బలమైన రాజకీయ సంకల్పంతో పాటు శాస్త్రీయంగా మద్దతు ,సాక్ష్యాధారాల ఆధారంగా దేశం ప్రతిస్పందన , నిర్ణయాధికార చురుకుదనాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. ప్రభుత్వ వ్యూహాలు దేశ వైవిధ్యాన్ని కూడా కలిగి ఉంటాయని ఇవి నిర్ధారించాయి, వేగంగా మారుతున్న పరిస్థితులకు తన ప్రతిస్పందనను విజయవంతంగా సమీకృతం చేశాయి. దాదాపు అన్ని కోవిడ్ వ్యాక్సిన్లు వాస్తవానికి వ్యాధిని తగ్గించే వ్యాక్సిన్లు అని, వ్యాధిని నిరోధించే వ్యాక్సిన్లు కావని పరిగణనలోకి తీసుకొని, ఆసుపత్రిలో చేరే రేట్లు ,ఇతర కారకాల వంటి సూక్ష్మాంశాలను చేర్చడానికి ఈ అధ్యయనాన్ని రేఖాంశ కోణంలో పొడిగించాలని ఆయన సిఫార్సు చేశారు.

స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీ లెక్చరర్ డాక్టర్ అమిత్ కపూర్, స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీ యూఎస్-ఆసియా టెక్నాలజీ మేనేజ్మెంట్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ రిచర్డ్ డాషర్ ఈ నివేదికను విడుదల చేశారు. ఆరోగ్య కార్యకర్తలు ,పౌరులకు ప్రాధాన్యతనిచ్చే వ్యాక్సినేషన్ డ్రైవ్ ను భారతదేశం విజయవంతంగా ప్రారంభించిందని, భారీ స్థాయిలో ,వైవిధ్యంతో దానిని నిర్వహించిందని బిఎంజిఎఫ్ ఇండియా కంట్రీ ఆఫీస్ డైరెక్టర్ శ్రీ హరి మీనన్ వంటి ముఖ్య వక్తలు నొక్కి చెప్పారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలోని హార్వర్డ్ టిహెచ్ చాన్స్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ వి సుబ్రమణియన్ మాట్లాడుతూ, "కోవిడ్ వ్యాక్సినేషన్ డ్రైవ్ చురుకుదనం ఆకట్టుకుంటుంది, ప్రత్యేకించి దీనికి ఎటువంటి చారిత్రక ప్రాధాన్యత లేదు" అని అన్నారు. దీన్ని పిల్లలకు కూడా వర్తింపజేయవచ్చని ఆయన తెలిపారు. బయోసైన్స్, బయోఫార్మా రంగాల్లో భారత్ ఎదుగుతున్నదని హార్వర్డ్ యూనివర్సిటీ కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్ విభాగం ప్రొఫెసర్ మార్క్ ఎస్పోసిటో అన్నారు.

ఈ విజయం ప్రపంచానికి ఒక ఉదాహరణగా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా ఇతర సంబంధిత సమస్యలను పరిష్కరించడానికి దాని వ్యూహాలను వర్తింపజేయవచ్చు. కోవిడ్ కాలంలో తీసుకున్న వివిధ కార్యక్రమాల ద్వారా చూపిన స్థితిస్థాపకత గురించి ప్రొఫెసర్ రిచర్డ్ డాషర్ వివరించారు. ప్రత్యక్ష ,పరోక్ష నిధుల ద్వారా 280 బిలియన్ అమెరికన్ డాలర్లు (ఐఎంఎఫ్ ప్రకారం) ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావాన్ని చూపింది .రాష్ట్ర ప్రభుత్వ సామర్థ్యాలను పెంచడానికి సహాయపడింది.

స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో హోలీ సంబురాలు

- రంగులు చల్లుకుంటూ ఆనందోత్సవాలు జరుపుకున్న పాఠశాల విద్యార్థులు

ఖమ్మం, మార్చి 6: (నేటినిజం ప్రతినిధి): స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో సోమవారం విద్యార్థులు హోలీ సంబరాలు నిర్వహించారు.సహజమైన రంగులతో పాఠశాల చిన్నారులు హోలీ వేడుకలలో పాల్గొన్నారు. విద్యార్థులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ వసంతోత్సవం జరిపారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ.. పురాణాల కాలం నుంచి హోలీ వేడుకలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ప్రకృతి రమణీయతలోని వివిధ రంగురంగుల పుష్పాల విశిష్టత, వాతావరణ మార్పులకు చిహ్నంగా హోలీ పర్వదినాన్ని జరుపుకుంటున్నామన్నారు.బంధుమిత్రుల మధ్య అనురాగ ఆప్యాయతలు పెంపొందడానికి హోలీ వేడుకలు దోహదపడుతున్నాయని వివరించారు.

వసంతకాల ఆగమనాన్ని తెలియజేసే హోలీ పర్వదిన ప్రత్యేకతను తెలియజేయడానికి తమ పాఠశాలలో హోలీ సంబరాలను నిర్వహించామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిఐ అంజలికి సేవానంధిని పురస్కారం

ఖమ్మం, మార్చి 6: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం ట్రాఫిక్ సిఐ అంజలికి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సంధర్భంగా తారా ఆర్ట్స్ అకాడమీ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా విశిష్ట పురస్కారాలు 2023లో సేవ నంధిని పురస్కారం అందుకున్నారు. పలువురు అభినంధించారు.

మా నాన్నే నన్ను లైంగికంగా వేధించారు..

-సంచలన విషయాలు వెల్లడించిన ఖుష్బూ

హైదరాబాద్ మార్చ్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ 0;నటి ఖుష్బూ గురించి ప్రత్యేకించి పరిచయం అక్కర్లేదు. బాలనటిగా కెరీర్ ప్రారంభించిన ఖుష్బూ 'కలియుగ పాండవులు' సినిమాతో హీరోయిన్‌గా మారింది. తొలి సినిమానే తిరుగులేని గుర్తింపు తెచ్చిపెట్టింది. ఆ తర్వాత వరుస అవకాశాలతో దక్షిణాదిన స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది. ఇక హీరోయిన్ నుంచి రిటైర్ అయ్యాక సపోర్టింగ్ యాక్టర్‌గా సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టింది. సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ మంచి మంచి పాత్రలు చేస్తూ దుసుకుపోతుంది. ఇదిలా ఉంటే తాజాగా ఖుష్బూ మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులపై రియాక్టయింది. తన చిన్నతనంలో జరిగిన లైంగిక వేధింపుల గురించి సంచలన విషయాలను బయపెట్టింది.తను కూడా లైంగిక వేధింపులకు గురైనట్లు ఖుష్బూ వెల్లడించింది. తన తండ్రి నుంచి లైంగిక వేధింపులు ఎదుర్కొన్నట్లు తెలిపింది. అయితే అప్పుడు తన వయసు ఎనిమిదేళ్లని, పదిహేనేళ్లు వచ్చాక తన తండ్రిని ఎదిరించానని చెప్పింది. దాంతో తన తండ్రి కుటుంబాన్ని వదిలి వెళ్లిపోయాడని తెలిపింది. లైంగిక వేధింపులపై ప్రస్తుతం కుష్బూ చేసిన ఈ కామెంట్స్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. ముంబైలో ముస్లిం కుటుంబంలో జన్మించిన ఖుష్బూ చిన్ననాటి నుంచి నటనపై ఆసక్తిపెంచుకుంది. వినోద్‌ఖన్నా హీరోగా నటించిన 'ద బర్నింగ్ ట్రైన్' సినిమాతో తొలిసారి కెమెరా ముందుకు వచ్చింది. ఇక ఖుష్బూ తమిళ దర్శకుడు, నటుడు సి.సుందర్‌ను ప్రేమ వివాహం చేసుకుంది.

వృద్ధాశ్రమంలో వృద్ధులకు నిత్యావసర వస్తువులను పంపిణి

హైదరాబాద్ మార్చ్ 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్);హైదరాబాద్ లోని సరూనగర్, చంపాపేట్ లో గల శ్రీ వాత్సల్య వల్లి ఫౌండేషన్ లో వృద్ధాశ్రమం లో టాటా మణి ఛారిటబుల్ ట్రస్ట్, వ్యవస్థాపక చైర్‌పర్సన్ కాకుమాను లౌర్డు జ్యోతిసీనియర్ సిటిజన్లు/వృద్ధాప్యం కోసం నిత్యావసర వస్తువులను పంపిణి చేసారు.ఈ కార్యక్రమానికి బాబు మిరియం ముఖ్య అతిధిగా విచ్చేసి వస్తువులను పంపిణి చేసారు. ఈ సందర్భంగా ట్రస్ట్, వ్యవస్థాపక చైర్‌పర్సన్ కాకుమాను లౌర్డు జ్యోతి ప్రుద్ధప్రమానికి ఉప్మా రవ్వ, పంచదార టీ పొడి. బిస్కెట్లు, బన్నాన్లు, చసము అందించమని చెప్పారు.ఈ కార్యక్రమం లో టాటా మణి ఛారిటబుల్ ట్రస్ట్ సబ్యురాలు ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

చెరుకు సుధాకర్‌పై కోమటిరెడ్డి వెంకటరెడ్డి అహంకారానికి నిదర్శనం

-కోమటిరెడ్డి వెంకటరెడ్డి తక్షణమే బీసీలకు క్షమాపణ చెప్పాలి

-బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్

హైదరాబాద్ మార్చ్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);తెలంగాణ ఉద్యమకారుడు బీసీ సామాజిక వర్గానికి చెందిన చెరుకు సుధాకర్ పై భువనగిరి పార్లమెంట్ సభ్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి తీవ్ర పదజాలంతో,వ్రాయలేని బాషలో అసభ్యంగా దూషించి,చంపుతామని బెదిరించ దాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జా

రెవిన్యూ సమస్యలను త్వరగా పరిష్కరించాలి: కలెక్టర్ వి.పి. గౌతమ్

ఖమ్మం, మార్చి 6: (నేటినిజం ప్రతినిధి): రెవిన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. సోమవారం ఐడిఓసిలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి తహశీల్దార్లతో రెవిన్యూ సమస్యల పరిష్కారంపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ధరణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. పెండింగ్ జిఎల్ఎం, సక్సేషన్ దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ భూములు, ప్రభుత్వ సేకరణ భూముల వివరాలు సమర్పించాలన్నారు. బలహీన వర్గాలకు ఇండ్ల స్థలాల పంపిణీకి స్థలాలు గుర్తించాలన్నారు. జీవో 58,59లపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. బూత్ స్థాయి అధికారులకు పారితోషకం విడుదల అయినట్లు, అట్టి కాలమునకు పనిచేసిన బూత్ లెవల్ అధికారుల జాబితా సమర్పించాలన్నారు. ఫోటో సిమిలర్ వేరిఫికేషన్ ప్రక్రియపై సమీక్ష చేయాలని, క్షేత్ర స్థాయి తనిఖీలు వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ ఎన్. మధుసూదన్, శిక్షణా అసిస్టెంట్ కలెక్టర్ రాధిక గుప్తా, ఖమ్మం ఆర్డీవో రవీంద్రనాథ్, సాంఘీక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కె. సత్యనారాయణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఖబర్దార్ కోమటిరెడ్డి సుధాకర్ జోలికి వస్తే ఊరుకునేది లేదు

ఖమ్మం, మార్చి 6: (నేటినిజం ప్రతినిధి): భువనగిరి పార్లమెంటు కోమటిరెడ్డి వెంకటరెడ్డి తన కుల అహంకారంతో, కండ కావరంతో, మదంఎక్కిన పిచ్చిపట్టిన కుక్కల డాక్టర్ చెరుకు సుధాకర్ ని నానావిధాలుగా దుర్భాషలాడి, చంపేస్తానని, నీచావు నీకాడుకు చావు వారం రోజుల్లోనే మా అనుచరుల చేతుల్లో ఉంటుందని, నీ యొక్క హాస్పటల్ ను కూల్చివేస్తానని సెల్ ఫోన్ లో వార్నింగ్ ఇవ్వడం జరిగింది. దాదాపుగా 40 సంవత్సరాల నుండి ప్రజల కోసం, ప్రజా జీవితంలో అనేక ఆటుపోట్లు ఎదుర్కొని, తెలంగాణ ఉద్యమంలో అప్పటి ప్రభుత్వంలో పీడీయాక్ట్ కేసులో జైలు జీవితాన్ని అనుభవించిన ఏకైక తెలంగాణ ఉద్యమకారుడు చెరుకు సుధాకర్, అంతటి త్యాగధనున్ని ఒక పిచ్చి పట్టిన కోతిలాగా తన ఇష్టారాజ్యంగా మాట్లాడటం, బెదిరింపులకు పాల్పడడం కడు శోచనీయం. ఇలాంటి పిచ్చి కూతలకు, తాటాకు చప్పుళ్ళకు భయపడే వ్యక్తి కాదు డాక్టర్ చెరుకు సుధాకర్, అతను ఒక దీశాలి వెంటనే కోమటిరెడ్డి వెంకటరెడ్డి తన మాటలను వెనక్కి తీసుకొని డాక్టర్ కి బహిరంగ క్షమాపణ చెప్పాలి. చెప్పనియెడల తెలంగాణ ఉద్యమకారుల ఆగ్రహానికి గురికాక తప్పదని బిసి ఎస్సి ఎస్టి మైనారిటీ ప్రజాసంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేస్తుంది. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక చైర్మన్ డాక్టర్ కెవి కృష్ణరావు, కన్వీనర్ గుంతెటి విరభద్రయ్య, కో కన్వీనర్స్ పెరుగు వెంకటరమణ, బానోత్ బద్రు నాయక్, అబ్దుల్ రెహమాన్, షేక్ నజీమా, వల్లపు సోమరాజ్, మాల మహానాడు నాయకులు దాసరి శ్రీనివాస్, కే. రామారావు, మహిళా నాయకులు రమ్య, ఉపేంద్ర, బాసటి హనుమంతరావు, షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలను ప్రారంభించిన సంద్ర

- వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవ వేడుకల్లో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే

ఖమ్మం, మార్చి 6: (నేటినిజం ప్రతినిధి): వేంసూరు మండలం కందుకూరు గ్రామంలో కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి తిరు కళ్యాణ మహోత్సవ గత రాత్రి ఆలయ అర్చకుల సమక్షంలో శాస్త్రోక్తంగా అంగరంగ వైభవంగా నిర్వహించగా సత్తుపల్లి శాసనసభ్యులు సంద్ర వెంకట వీరయ్య స్వామివారిని దర్శించుకున్నారు. కళ్యాణ మహోత్సవ వేడుకల్లో భాగంగా గ్రామస్తులు నిర్వహిస్తున్న రెండు తెలుగు రాష్ట్రాల పురుషుల కబడ్డీ పోటీలను జెండా ఊపి ఆవిష్కరించిన సత్తుపల్లి శాసనసభ్యులు సంద్ర వెంకట వీరయ్య, మొదటి జట్టు పోటీదారులకు శుభాకాంక్షలు తెలిపారు. కబడ్డీ పోటీలలో భాగంగా 6,7,8 తేదీల్లో 10 జట్టుల పోటీదారులు పాల్గొంటారు. ఎనిమిదో తేదీ నాడు బహుమతుల ప్రధోనత్సవానికి మంత్రులు, ఎంపీలు, జిల్లా ప్రజా ప్రతినిధులు విచ్చేస్తున్నట్లు ఎమ్మెల్యే సంద్ర తెలిపారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి, అన్నదాన విరాళాల హుండీలో విరాళాన్ని సమర్పించారు. ప్రాచీన చరిత్ర కలిగిన కందుకూరు వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాలు గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో శోభోపేతంగా నిర్వహించటం, కనుమరుగవుతున్న క్రీడా స్ఫూర్తిని పెంపొందించే విధంగా ఎద్దుల బల ప్రదర్శన, పురుషుల కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నారని నిర్వహకులని అభినందించారు. కళ్యాణ మహోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలను వీక్షించేందుకు వేలాదిమందిగా భక్తులు విచ్చేస్తున్న తరుణంలో పోలీస్ భద్రత, భక్తులకు సౌకర్యాలు తదితర ఏర్పాట్లను గురించి ఆలయ నిర్వహకులను ఎమ్మెల్యే సంద్ర వెంకట వీరయ్య అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు.

ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మహిళలంటే గౌరవం లేదు

-బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

హైదరాబాద్ మార్చ్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్):: ముఖ్యమంత్రి కేసీఆర్ కు మహిళలంటే గౌరవం లేదని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ విమర్శలు గుప్పించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. తన గొప్పతనాన్ని చాటుకునేందుకే దిశా కేసు లో ఎన్‌కౌంటర్ చేయించారన్నారు. కేఎంసీ ఆసుపత్రి లో సీసీ కెమెరాలు పనిచేయలేదంటే నేరాన్ని తప్పించుకునేందుకే పగడ్బందీగా ప్లాన్ చేసారని అర్థమవుతుందని తెలిపారు. ఆడపిల్లలను చదువు కోసం హాస్టల్స్‌కు పంపాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారన్నారు. మరోసారి అధికారంలోకి రావాలని ఆలోచన తప్పితే మహిళలపై జరుగుతున్న దారుణాలపై కేసీఆర్ కు ఆలోచన లేదని బీజేపీ నేత మండిపడ్డారు. కార్పోరేట్ విద్యాసంస్థల్లో ఒత్తిడి గురై విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా.. యాజమాన్యాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే ప్రీతి హత్య కేసు లో ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. ప్రీతి కేసు ను ప్రభుత్వం నీరుగార్చే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. కేసు నీరుగార్చే ప్రయత్నం చేస్తే బీజేపీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు ఆపడానికి ముఖ్యమంత్రిగా ఎలాంటి చర్యలు తీసుకుంటారో కేసీఆర్ స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రీతి ఘటనపై పూర్తి నిజానిజాలు బయటకు రావాల్సిన అవసరం ఉందని డీకే అరుణ పేర్కొన్నారు.

మద్యం మత్తులో యువతరం..

-గతేడాది నవంబర్ నాటికి డ్రంకెన్ డ్రైవ్ లో 19 వేల కేసులు నమోదు

హైదరాబాద్ మార్చ్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);మద్యం మత్తులో యువతరం చిక్కుకుంది. కిక్కుకోసం పబ్‌లకు, బార్‌లకు పరుగులు తీస్తోంది. పబ్‌కల్చర్ యూత్‌ను ఉర్రూతలూగిస్తోంది. మత్తులో మునిగిన కుర్రకారు మితిమీరిన వేగంతో వాహనాలను నడిపి అదుపు తప్పుతోంది. ఖరీదైన కార్లతో రయ్యిమంటూ దూసుకుపోయి ప్రమాదాలకు కారణమవుతోంది. అర్ధరాత్రి ఆగడాలకు అడ్డూఅదుపూ లేకుండాపోయింది. మద్యం తాగి వాహనాలు నడపకుండా ఉండేందుకు నగర ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్‌ను ప్రవేశపెట్టారు. శుక్ర, శనివారాల్లో ఈ తనిఖీలను ముమ్మరంగా నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నా..యువతలో మార్పు రావడం లేదు. తొలిరోజుల్లో డ్రంకెన్ డ్రైవ్ సత్ఫలితాలను ఇచ్చింది. మద్యం తాగిన వారు తూగుతూ...వాహనాలు నడపడం తగ్గించారు. తరువాత కాలంలో తూలుతూ వాహనం నడపడం క్రేజ్‌గా మార్చుకున్నారు. ఈ ఏడాది డ్రంకెన్ డ్రైవ్ కేసులు రికార్డుస్థాయిలో నమోదయ్యాయి. గతేడాది నవంబర్ నాటికి సుమారు 19 వేల కేసులు నమోదయ్యాయి. గతేడాదితో పోలిస్తే పది శాతం కేసులతోపాటు జైలు శిక్షలు కూడా పెరిగాయి. అయినప్పటికీ మందు బాబుల వీరంగం ఏమాత్రం తగ్గడం లేదు. "నగరానికి చెందిన ఓ యువకుడు అమ్మాయితో కలిసి పార్టీకి హాజరవ్వడానికి కారులో బంజారాహిల్స్

వైపు వెళుతున్నాడు. డ్రంకెన్ డ్రైవ్‌తనిఖీల్లో భాగంగా ట్రాఫిక్ పోలీసులు అతడ్ని ఆపి శ్వాస పరీక్ష చేయగా 98 ఃంఐ ఉందని తేలింది. కేసు నమోదు చేసిన పోలీసులపై యువకుడు చిందులు తొక్కాడు.. దుర్భాషలాడడంతో పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు.." "సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయిన యువతి డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడింది. నా మీదే కేసు పెడతారా అంటూ పోలీసులపై రంకెలు వేసింది. దీంతో ఆమెపై క్రిమినల్ కేసు నమోదైంది. మత్తు దిగాక తాను చేసిన తప్పు తెలుసుకుంది. కానీ ఏమి లాభం? కేసు మాత్రం ఇంకా అలాగే కొనసాగుతోంది."

ఆరోగ్యం మరియు వైద్య పరిశోధన అనే అంశం పై ఏర్పాటైన బడ్జెటు అనంతర వెబినార్

న్యూఢిల్లీ, మార్చి 6:'ఆరోగ్యం మరియు వైద్య సంబంధి పరిశోధన' అనే అంశం పై ఏర్పాటైన బడ్జెటు అనంతర వెబినార్ ను ఉద్దేశించి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రసంగించారు. యూనియన్ బడ్జెటు 2023 లో ప్రకటించిన కార్యక్రమాల ను ప్రభావంతమైనటువంటి రీతి లో అమలు పరచడం కోసం ప్రభుత్వం ఆలోచనల ను మరియు సూచనల ను ఆహ్వానిస్తూ ఏర్పాటు చేస్తున్న బడ్జెటు అనంతర వెబినార్ లు పన్నెండిటి లో ఈ వెబినార్ తొమ్మిదో వెబినార్.

ఈ కార్యక్రమం లో పాలుపంచుకొన్న వారి ని ఉద్దేశించి ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ, ఆరోగ్య సంరక్షణ ను కోవిడ్ కు ముందు మరియు కోవిడ్ కు తరువాతి కోణాల లో పరిశీలించవచ్చును అని పేర్కొన్నారు. మహమ్మారి సమృద్ధియుక్త దేశాల ను సైతం పరీక్షించింది అని ఆయన అన్నారు. ఈ మహమ్మారి ఆరోగ్యం విషయం లో ప్రపంచ దేశాల అప్రమత్తత పట్ల తన దృష్టి ని కేంద్రీకరించగా భారతదేశం ఒక అడుగు ముందుకు వేసి, వెల్ నెస్ పట్ల శ్రద్ధ వహించింది అని ఆయన అన్నారు. "ఈ కారణం గానే మనం ప్రపంచం ఎదుట ఒక దృష్టికోణాన్ని నిలిపాం. అది – 'ఒక భూమి, ఒక ఆరోగ్యం' అనేది. ప్రాణులు అన్నిటికి అంటే – మానవులు, పశువులు లేదా మొక్కలు అన్న మాట– కీ సంపూర్ణ ఆరోగ్య సంరక్షణ ను అందించడం ఈ దృష్టికోణం లో భాగం గా ఉంది." అని ప్రధాన మంత్రి వివరించారు.

మహమ్మారి కాలం లో సప్లయ్ చైన్ కు సంబంధించిన పాఠాల ను నేర్చుకోవడం జరిగింది అని ప్రధాన మంత్రి పునరుద్ఘాటిస్తూ, మరి అది ఒక గొప్ప ఆందోళనకరమైనటువంటి అంశం గా మారింది అన్నారు. మహమ్మారి దాని శిఖర స్థాయి ని చేరుకొన్న కాలం లో మందులు, టీకామందు లు, చికిత్స కు అవసరమైన పరికరాల వంటి ప్రాణ రక్షక సామగ్రి ని ఆయుధాల వలె భావించడం శోచనీయం అని ఆయన అన్నారు. ఇదివరకటి సంవత్సరాల బడ్జెటుల లో భారతదేశం విదేశాల పైన ఆధారపడుతూ ఉండడాన్ని తగ్గించడానికి అదే పని గా ప్రభుత్వం ప్రయత్నిస్తూ వచ్చింది, ఈ విషయం లో స్టేక్ హోల్డర్స్ అందరికి పాత్ర ఉందని ప్రధాన మంత్రి స్పష్టంచేశారు.

స్వాతంత్ర్యం అనంతర కాలం లో దశాబ్దాల తరబడి ఆరోగ్యం విషయం లో ఒక సమగ్రమైన దీర్ఘకాలిక దార్శనికత లోపించింది అని ప్రధాన మంత్రి ప్రస్తావించారు. ఆరోగ్యం అనే విషయాన్ని ఆరోగ్య మంత్రిత్వ శాఖ కు ఒక్కదానికే పరిమితం చేయడం కంటే దాని ని యావత్తు ప్రభుత్వ వైఖరి గా ప్రస్తుతం నేను ముందుకు తీసుకు పోతున్నాం అని ప్రధాన మంత్రి అన్నారు. "వైద్య చికిత్స అనేది తక్కువ ఖర్చు లో అందుబాటు లో ఉండేటట్లు చూడడం మా ప్రభుత్వ అత్యున్నత ప్రాథమ్యం గా ఉంది" అని ప్రధాన మంత్రి అన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం లో భాగం గా అందజేసిన ఉచిత చికిత్స ల కారణం గా పేద రోగుల కు దాదాపు గా ఎనభై వేల కోట్ల రూపాయలు మిగిలాయి అని ఆయన వెల్లడించారు. రేపటి రోజు న అంటే మార్చి నెల 7వ తేదీ 'జన్ ఔషధి దివస్' గా పాటించడం జరుగుతుంది అని ప్రధాన మంత్రి తెలియజేస్తూ, దేశం అంతటా పేదలు మరియు మధ్యతరగతి ప్రజల కు 9,000 జన్ ఔషధి కేంద్రాల నుండి తక్కువ ఖర్చు లో మందుల ను అందించినందువల్ల దాదాపు గా ఇరవై వేల కోట్ల రూపాయలు ఆదా అయ్యాయి అని వివరించారు. అంటే, ఈ రెండు పథకాల తోనే పౌరుల కు ఒక లక్ష కోట్ల రూపాయలు ఆదా అయ్యాయని అర్థం.

తీవ్రమైన జబ్బుల కు చికిత్స చేయాలి అంటే బలమైన ఆరోగ్య రంగ సంబంధి మౌలిక సదుపాయాల ను సమకూర్చుకోవడం ముఖ్యం అని ప్రధాన మంత్రి చెప్పారు. ప్రభుత్వానికి అతి ముఖ్యమైన అంశాన్ని గురించి ప్రధాన మంత్రి ప్రముఖం గా ప్రకటిస్తూ, దేశవ్యాప్తం గా జనావాసాల కు దగ్గరి ప్రాంతాల లో 1.5 లక్షల కు పైచిలుకు సంఖ్య లో ఆరోగ్య కేంద్రాల ను అభివృద్ధి పరచడం జరుగుతున్నది. వీటి ఉద్దేశ్యం పరీక్ష కేంద్రాల ను మరియు ప్రథమ చికిత్స ను అందుబాటు లోకి తీసుకురావడమే అని ఆయన అన్నారు. మధుమేహం, కేన్సర్, ఇంకా గుండె సంబంధి సమస్యల వంటి గంభీరమైన రుగ్మతల ను పసిగట్టడాని కి అవసరం అయ్యేటటువంటి సదుపాయాలు సైతం ఈ కేంద్రాల లో అందుబాటు లోకి వస్తాయి అని ఆయన చెప్పారు. క్రిటికల్ హెల్త్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ను చిన్న పట్టణాల కు మరియు పల్లెల కు అందుబాటు లోకి తీసుకు రావడం జరుగుతున్నది. ఇది కొత్త ఆసుపత్రుల సంఖ్య పెరిగేందుకు మాత్రమే కాకుండా, ఒక నవీనమైనటువంటి మరియు సంపూర్ణమైనటువంటి హెల్త్ ఇకోసిస్టమ్ ను కూడా ఏర్పరుస్తున్నది అని ప్రధాన మంత్రి వివరించారు. ఫలితం గా ఇది ఆరోగ్య రంగంలోని నవ పారిశ్రామికవేత్తల కు, ఇన్వెస్టర్ లకు మరియు వృత్తి నైపుణ్యం కలిగిన వర్గాల కు అనేక అవకాశాల ను కల్పిస్తున్నది అని ప్రధాన మంత్రి అన్నారు.

ఆరోగ్య రంగం లో మానవ వనరుల ను గురించి ప్రధాన మంత్రి ప్రస్తావిస్తూ, గడచిన కొన్ని సంవత్సరాల లో 260 కి పైగా కొత్త వైద్య కళాశాల లను ఆరంభించడమైంది అని తెలియజేశారు. ఇది 2014 వ సంవత్సరం తో పోల్చి చూసినప్పుడు స్నాతక వైద్య కోర్సులు మరియు స్నాతకోత్తర వైద్య కోర్సుల లో మెడికల్ సీట్ ల సంఖ్య ను రెండింతలు చేసింది అని ఆయన వివరించారు. ఈ సంవత్సరం బడ్జెటు లో నర్సింగ్ రంగం పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరిగింది అని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు. "వైద్య కళాశాల లకు దగ్గరి ప్రాంతాల లో 157 నర్సింగ్ కళాశాల లను తెరవడం వైద్య చికిత్స రంగ సంబంధి మానవ వనరుల పరం గా తీసుకొన్నటువంటి ఒక పెద్ద నిర్ణయం. ఇది ఒక్క దేశీయ అవసరాల ను తీర్చడం మాత్రమే కాదు, ప్రపంచ దేశాల అవసరాల ను తీర్చడం లోనూ ఉపయోగకరం అయ్యేందుకు అవకాశం ఉంది" అని ఆయన అన్నారు.

వైద్య సంబంధి సేవల ను మరింత మంది కి చౌక గా అందుబాటు లోకి తీసుకుపోతుండడం లో సాంకేతిక విజ్ఞానం యొక్క పాత్ర ను గురించి ప్రధాన మంత్రి ప్రముఖం గా ప్రస్తావించారు. ఈ రంగం లో సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించడం పై ప్రభుత్వం శ్రద్ధ వహిస్తోందన్నారు. "డిజిటల్ హెల్త్ ఐడి సౌకర్యం ద్వారా పౌరుల కు సరి అయిన కాలం లో ఆరోగ్య సంరక్షణ ను అందించాలి అని వేం కోరుకొంటున్నాం. ఇ-సంజీవని వంటి పథకాల సాయం తో పది కోట్ల మంది ఈసరికే టెలికన్సల్టేషన్ ప్రయోజనాన్ని అందుకొన్నారు" అని ఆయన అన్నారు. స్టార్ట్-అప్స్ కు ఈ రంగం లో నూతన అవకాశాల ను 5జి ప్రసాదిస్తున్నది. డ్రోన్స్ అనేవి మెడిసిన్ డెలివరీ లోను, టెస్టింగ్ సర్వీసెస్ లోను క్రాంతికారి మార్పుల ను తీసుకు వస్తున్నాయి. "ఇది నవ పారిశ్రామికవేత్తల కు ఒక గొప్ప అవకాశం. మరి అందరికి ఆరోగ్య సంరక్షణ విషయం లో మనం చేస్తున్న ప్రయత్నాల కు ఊతం అందుతుంది కూడాను" అని ఆయన వివరించారు. ఏ సాంకేతిక పరిజ్ఞాన్ని అయినా దిగుమతి చేసుకోవాలి అనే ధోరణి కి స్వస్తి పలకండి అంటూ నవ పారిశ్రామికవేత్తల కు ఆయన ఉద్బోధించారు. ఈ విషయం లో సంస్థల పరం గా ప్రతిస్పందన అవసరం అని ప్రధాన మంత్రి అన్నారు. వైద్య చికిత్స పరికరాల రంగం లో కొత్త పథకాల ను గురించి ఆయన తెలియజేశారు. ఈ సందర్భం లో ఆయన బల్క్ డ్రగ్ పార్క్ స్, మెడికల్ డివైజ్ పార్క్ స్, పిఎల్ఐ స్కీముల లో ముప్పై వేల కోట్ల రూపాయల పైచిలుకు నిధుల ను గురించి వివరించారు. గడచిన కొన్ని సంవత్సరాల లో వైద్య సంబంధి పరికరాల లో 12 నుండి 14 శాతం వృద్ధి ఉంది అని ఆయన తెలిపారు. ఈ బజారు రాబోయే సంవత్సరాల లో 4 లక్షల కోట్ల రూపాయల స్థాయి కి చేరుతుంది అని ఆయన అన్నారు. రాబోయే కాలం లో వైద్య సంబంధి సాంకేతిక విజ్ఞానం తో పాటు, ఖరీదైన ఉత్పత్తుల తయారీ, మరిన్ని పరిశోధన ల కోసం నైపుణ్యం కలిగి ఉండే శ్రమ శక్తి నిర్మాణం పట్ల భారతదేశం ఇప్పటికే కృషి చేస్తున్నది అని ప్రధాన మంత్రి అన్నారు. ఐఐటి వంటి సంస్థ లు, బయో మెడికల్ ఇంజినియరింగ్ వంటి కోర్సుల ను నిర్వహించడం జరుగుతోంది అని ఆయన అన్నారు. పరిశ్రమ కు, విద్య రంగాని కి మరియు ప్రభుత్వానికి మధ్య మరింత సమన్వయం ఏర్పడగల మార్గాల ను గుర్తించాలి అని ఈ కార్యక్రమం లో పాలుపంచుకొన్నవారిని ఆయన కోరారు.

భారతదేశం యొక్క ఫార్మ సెక్టర్ పట్ల ప్రపంచాని కి విశ్వాసం పెంపొందుతూ ఉండడాన్ని ప్రధాన మంత్రి ప్రముఖం గా పేర్కొంటూ, ఈ ధోరణి ని సద్వినియోగ పరచుకోవలసిన అవసరాన్ని, అలాగే ఈ ప్రతిష్ఠ ను కాపాడుకొనే దిశ లో కృషి చేయవలసిన అవసరాన్ని నొక్కి చెప్పారు. సెంటర్స్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ను ఏర్పాటు చేయడం ద్వారా ఈ సెక్టర్ లో పరిశోధన కు మరియు నూతన ఆవిష్కరణల కు దన్నుగా నిలచేలా ఒక కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించడం జరుగుతోంది అని ఆయన వెల్లడించారు. ఇది ఆర్థిక వ్యవస్థ ను బలపరచడం తో పాటుగా ఉపాధి తాలూకు కొత్త అవకాశాల ను కూడా అందిస్తుంది అని ఆయన వివరించారు. "ప్రస్తుతం భారతదేశం లో ఫార్మ సెక్టర్ యొక్క బజారు విలువ నాలుగు లక్ష ల కోట్ల రూపాయలు గా ఉంది" అని ప్రధాన మంత్రి అన్నారు. ప్రైవేటు రంగాని కి మరియు విద్య రంగాని కి మధ్య సమన్వయం ఏర్పడవలసిన అవసరం ఎంతైనా ఉంది అని ఆయన స్పష్టం చేశారు. ఎందుకు అంటే, ఇటువంటి సమన్వయం ఏర్పడినప్పుడు బజారు విలువ 10 లక్షల కోట్ల రూపాయల కు పైబడి విస్తరించేందుకు ఆస్కారం ఉంది అని ఆయన అన్నారు. పెట్టుబడుల కు అవకాశం ఉన్న ముఖ్య రంగాల ను గుర్తించండి అంటూ ప్రధాన మంత్రి సూచన చేశారు. ఈ రంగం లో పరిశోధన కు దన్ను గా నిలచేందుకు ప్రభుత్వం తీసుకొన్న అనేక చర్యల ను గురించి ప్రధాన మంత్రి ప్రముఖం గా ప్రస్తావిస్తూ, ఐసిఎమ్ఆర్ ద్వారా అనేక ప్రయోగశాలల ను కొత్త గా తెరవడమైంది అని వెల్లడించారు.

వ్యాధి నిరోధక ఆరోగ్య సంరక్షణ అనే అంశం లో ప్రభుత్వం ప్రయాసల యొక్క ప్రభావాన్ని శ్రీ నరేంద్ర మోదీ వివరించారు. స్వచ్ఛత ధ్యేయం తో చేపట్టిన స్వచ్ఛ్ భారత్ అభియాన్ ను గురించి, పొగ సంబంధి వ్యాధుల ను దృష్టి లో పెట్టుకొని తీసుకు వచ్చిన ఉజ్జ్వల పథకాన్ని గురించి, త్రాగునీటి ద్వారా సోకే వ్యాధుల ను ఎదుర్కోవడం కోసం ప్రవేశపెట్టిన జల్ జీవన్ మిశన్ ను గురించి, రక్తహీనత మరియు పోషకాహార లోపం సమస్యల ను పరిష్కరించడం కోసం ఉద్దేశించిన నేశనల్ పోషణ్ మిశన్ ను గురించి ఆయన తెలియ జేశారు. చిరుధాన్యాల అంతర్జాతీయ సంవత్సరం లో 'శ్రీ అన్నం' వంటి చిరుధాన్యాల పాత్ర ను గురించి కూడా ఆయన చెప్పారు. అదే విధం గా పిఎమ్ మాతృ వందన యోజన, మిశన్ ఇంద్రధనుష్, యోగ, ఫిట్ ఇండియా మూవ్ మెంట్ మరియు ఆయుర్వేద.. ఇవి వ్యాధుల బారి నుండి ప్రజల ను కాపాడుతున్నాయి అని పేర్కొన్నారు. భారతదేశం లో డబ్ల్యుహెచ్ఒ ఆధ్వర్యం లో గ్లోబల్ సెంటర్ ఫార్ ట్రెడిశనల్ మెడిసిన్ ను నెలకొల్పడాన్ని గురించి ప్రధాన మంత్రి చెప్తూ, ఆయుర్వేదం లో నిరూపణ ఆధారిత పరిశోధన లు చోటు చేసుకోవాలన్న తన అభ్యర్థన ను పునరుద్ఘాటించారు.

ఆధునిక వైద్య చికిత్స సంబంధి మౌలిక సదుపాయాలు మొదలుకొని ఈ రంగం లోని మానవ వనరుల వరకు ప్రభుత్వం చేపట్టిన ప్రయాసల ను గురించి శ్రీ నరేంద్ర మోదీ వివరించారు. నూతన సామర్థ్యాల ను కేవలం పౌరుల కు ఆరోగ్య సదుపాయాల ను కల్పించడానికే పరిమితం చేయకుండా ప్రపంచ దేశాల లో అత్యంత ఆకర్షణీయమైనటువంటి వైద్య ప్రధాన పర్యటన గమ్యస్థానం లా భారతదేశాన్ని తీర్చిదిద్దాలి అనేటటువంటి లక్ష్యాన్ని కూడా పెట్టుకోవడమైంది అని ఆయన వివరించారు. భారతదేశం లో వైద్య ప్రధాన పర్యటన అనేది ఒక అతి పెద్ద రంగం గా ఉందని ఆయన అంటూ, ఇది దేశం లో ఉపాధి కల్పన కు ఒక భారీ మాధ్యం గా కూడా రూపుదాల్చుతోంది అన్నారు.

సబ్ కా ప్రయాస్ (ప్రతి ఒక్కరి ప్రయత్నాల) ద్వారా మాత్రమే భారతదేశం లో ఒక అభివృద్ధియుక్త హెల్త్ ఎండ్ వెల్ నెస్ ఇకోసిస్టమ్ ను ఏర్పరచవచ్చును అని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు. "దీనికి గాను సంబంధి వర్గాలు అన్నీ విలువైన సూచనల ను చేయాలి అని ఆయన కోరారు. పెట్టుకొన్న లక్ష్యాల ను ఒక నిర్దిష్ట మార్గసూచి సాయం తో కాల పరిమితి కి లోపే బడ్జెటు ప్రతిపాదనల ను మనం అమలులోకి తీసుకురా గలగాలి. రాబోయే బడ్జెటు కంటే ముందుగానే అన్ని కలల ను నెరవేర్చుకొంటూ, ఈ క్రమం లో సంబంధి వర్గాలు అన్నిటిని కలుపుకొని పోవాలి. అది జరగాలి అంటే అందుకు మీ అనుభవం తాలూకు ప్రయోజనం అవసరపడుతుంది" అని సభికుల కు చెప్తూ, ప్రధాన మంత్రి తన ప్రసంగాన్ని ముగించారు.

న్యూ ఢిల్లీలో భారీ ఆరోగ్యానికి నడక

న్యూఢిల్లీ, మార్చి 6:కేంద్ర ఆరోగ్య మరియూ కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా న్యూ ఢిల్లీలో భారీ ఆరోగ్యానికి నడక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఉత్సాహంగా పాల్గొనేవారు మెరుగైన ఆరోగ్యం కోసం నడక కార్యక్రమం లో గొప్ప ఉత్సాహంతో మరియు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. శారీరక, మానసిక ఉల్లాసం కోసం ఇలాంటి ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు.

గౌరవ ప్రధానమంత్రి ఆరోగ్య భారతదేశం కోసం అనే దృష్టిని అనుసరించి, వాక్‌థాన్ మరియు ఇలాంటి ఈవెంట్‌లు పౌరులలో ఆరోగ్యకర ప్రవర్తనా మార్పులను తీసుకురావడానికి మరియు మరింత శారీరకంగా చురుకైన జీవనశైలి గురించి అవగాహన కల్పించడానికి ఉద్దేశించబడ్డాయి. అటువంటి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తూ, సైకిల్ తొక్కడం పట్ల తనకున్న ఉత్సాహంతో "గ్రీన్ ఎంపీ"గా కూడా పిలువబడే కేంద్ర ఆరోగ్య మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా ఆరోగ్యం మరియు ఫిట్‌నెస్ కోసం శారీరక శ్రమను ప్రోత్సహిస్తున్నారు. దేశంలో 63% కంటే ఎక్కువ మరణాలకు అంటురోగాలు కాని జబ్బులు (ఐఅఆలు) కారణమవుతున్నాయి. పొగాకు వాడకం (ధూమపానం ద పొగ రహితం), మద్యపానంఅలవాట్లు, సరైన ఆహారం తీసుకోకపోవడం , తగినంత శారీరక శ్రమ లేకపోవడం మరియు వాయు కాలుష్యం వంటి ప్రధాన ప్రవర్తన ప్రమాద కారకాలతో ఎక్కువ మరణాలకు కారణమవుతాయి.

అంటురోగాలు కాని జబ్బులకు శారీరక బద్ధకం (నిష్క్రియాత్మకత) ప్రధాన ప్రమాద కారకాల్లో ఒకటి. నేషనల్ ఎన్‌సిడి మానిటరింగ్ సర్వే (ఎన్ఎన్ఎంఎస్) (2017-18)లో కూడా 41.3% భారతీయులు శారీరకంగా నిష్క్రియంగా నిశ్చలంగా ఉన్నారని కూడా ఇది ప్రతిబింబిస్తుంది. శారీరక శ్రమ యొక్క ఆరోగ్య ప్రయోజనాలు హృదయ సంబంధ వ్యాధులు, రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ మొదలైన అంటురోగాలు కాని జబ్బులను తగ్గించటం మాత్రమే కాకుండా మానసిక ఆరోగ్యంపై సానుకూల ప్రభావాలను కలిగి ఉంటాయి, చిత్తవైకల్యం యొక్క ఆగమనాన్ని ఆలస్యం చేస్

రైస్ మిల్లర్స్ సంఘ అధ్యక్షుడిగా ఎంపికైన బోయినపల్లి నర్సింగరావుకు ఘన సన్మానం

కరీంనగర్, మార్చి 6: (నేటినిజం ప్రతినిధి): కరీంనగర్ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి ఏకగ్రీవంగా ఎంపికైన బోయినపల్లి నర్సింగరావును శాతవాహన లయన్స్ క్లబ్ బాధ్యులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. నేడు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సమావేశ మందిరంలో నిర్వహించిన అభినందన సమావేశంలో పలువురు సీనియర్ లయన్స్ మాట్లాడుతూ లయన్ నర్సింగరావు గత దశాబ్దానికి పైగా శాతవాహన లయన్స్ క్లబ్‌లో బాధ్యతగల సభ్యుడిగా అనేక సేవాకార్యక్రమాలను నిర్వహిస్తూనే కేలబ్ అధ్యక్షుడిగా, జోన్ చైర్మన్‌గా, రూజియన్ చైర్మన్‌గా పలు బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించారని కొనియాడారు. వారి నాయకత్వ లక్షణాలు గుర్తించిన రైస్ మిల్లర్స్ తనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడఆనందదాయకంగా ఉందని ప్రశంసించారు. అత్యంత ప్రతిష్టాత్మక పదవిలో మూడేళ్ల పాటు రైస్ మిల్లర్స్ సంక్షేమంతో పాటు సమాజ సేవను కూడా చేయాలని ఆశించారు. ఈ కార్యక్రమంలో లయన్ కెప్టెన్ బుర్ర మధుసూదన్ రెడ్డి, డా: మనోహరాచారి, యం అరవింద్, సిహెచ్ రాంమోహన్‌రావు, ఇనుగుర్తి రమేష్, కె. రాజెందర్ రెడ్డి, యం. సత్యనారాయణ రావు, డి. తిరుపతి రెడ్డి, యం మహెందర్, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొని నర్సింగరావును ఘనంగా సన్మానించారు.

వైద్య, ఆరోగ్య శాఖపై సీఎం వైయస్ జగన్ సమీక్ష

అమరావతి, మార్చి 6:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన వైద్య, ఆరోగ్య శాఖపై సమీక్షా సమావేశం ప్రారంభమైంది. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో జరుగుతున్న ఈ సమావేశానికి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, ఉన్నతాధికారులు హాజరయ్యారు. వైద్య, ఆరోగ్య శాఖకు సంబంధించిన పలు అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు.

ప్రతి ఏటా గురుకుల విద్య పైన ప్రభుత్వం 6 వేల కోట్లకు పైగా నిధులను వెచ్చిస్తుంది

-మంత్రి కే టీ రామారావు
-సిరిసిల్లలో 1.10 కోట్లతో ముస్లిం షాదీఖాన భవనం ప్రారంభం

రాజన్న సిరిసిల్ల, మార్చి 6: తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఏటా గురుకుల విద్య పైన ప్రభుత్వం 6 వేల కోట్లకు పైగా నిధులను వెచ్చిస్తుందని కులమేదైనా, మతమేదైనా గురుకులాల ద్వారా మంచి శిక్షణ అందించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రవర్ణ పేదల పిల్లలను ప్రపంచంతో పోటీపడే పౌరులుగా తెలంగాణ విద్యార్థులను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం గత ఎనిమిదిన్నర సంవత్సరాలుగా అంకితభావంతో కృషి చేస్తుందని రాష్ట్ర మంత్రి కె తారక రామారావు అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 1000కి పైగా గురుకులాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మైనార్టీ విద్యార్థుల కోసం 204 గురుకులను ఏర్పాటు చేశామని చెప్పారు.

గురుకుల పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థిపై ఏటా 1.20 లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నామని మంత్రి కేటిఆర్ వెల్లడించారు.

సోమవారం సిరిసిల్ల పట్టణంలో మైనారిటీ సంక్షేమ శాఖ, సిరిసిల్ల ఎమ్మెల్యే నిధులు రూ. 1 కోటి 10 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన ముస్లిం షాదీఖాన భవనంను రాష్ట్ర మంత్రి కే తారక రామారావు ప్రారంభించారు.

ముస్లిం షాదీఖాన భవనంను మంచి వెంటిలేటర్ తో అందంగా నిర్మించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.తెలంగాణ స్వరాష్ట్రం ఏర్పడ్డాక రాష్ట్ర ముఖ్య మంత్రి సబ్బండ వర్గాల సంక్షేమం కోసం కుల మతాలకతీతంగా పనిచేశారని గుర్తు చేశారు. ప్రజలను ప్రజలుగా చూశారే తప్ప మతం పేరు మీద కులం పేరు మీద ఎప్పుడు రాజకీయాలు చేయలేదని స్పష్టం చేశారు.

తెలంగాణలో అమలవుతున్న పథకాలు దేశానికే తలమానికంగా నిలుస్తాయనీ చెప్పారు. పుట్టిన బిడ్డ నుంచి పండు ముదుసలి వరకూ పథకాలతో పేద ప్రజలు లబ్ధిపొందుతున్నారనీ చెప్పారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో గత ఎనిమిదిన్నర సంవత్సరాలలో ప్రభుత్వ మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల, వ్యవసాయ కళాశాల, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ,జేఎన్టీయూ కళాశాల సహా అనేక కళాశాలలు తెచ్చి విద్యాభివృద్ధి కి కృషి చేశామని చెప్పారు.

ఓవర్సీస్ విద్యా నిధి కింద విదేశాల్లో 7 వేల మంది విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న దేశంలోనే ఏకైక ప్రభుత్వం తెలంగాణ అని పేర్కొన్నారు.పథకాలు లబ్ధి పొందేందుకు కుల, మత, రాజకీయ, వర్గ భేదాలేమీ లేవన్నారు. అర్హులైతే చాలు పక్కాగా వారికి సంక్షేమ పథకాలు వర్తింప జేస్తున్నట్లు తెలిపారు.బాధ్యతాయుత ప్రతి పక్షాలు నిరాధారమైన ఆరోపణలు కాకుండా తాము ఏం చేశారో చేస్తారో ,చెప్పి ప్రజల మనసు గెలుచుకొవాలన్నారు.ఈ సందర్భంగా ముస్లిం నాయకులు ముస్లిం షాది ఖానాకు టెంట్ సామాగ్రి సమకూర్చుకునేందుకు రూపాయి పది లక్షల ఆర్థిక సాయం అందించాల్సిందిగా కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణా- రాఘవ రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబుద్దిన్, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రైతు బంధు సమితి అధ్యక్షులు గడ్డం నర్సయ్య,మజీద్ కమిటీ అధ్యక్షులు షేక్ యూసుఫ్, ఆర్డీఓ టి శ్రీనివాస్ రావు, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఇపుడు అందరి కళ్ళు సీబీఐపైనే కేంద్రీకృతం

న్యూ డిల్లీ మార్చ్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఇపుడందరి కళ్ళు సీబీఐపైనే కేంద్రీకృమయ్యున్నాయి. తాజా విచారణలో దర్యాప్తు సంస్థ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే విషయం ఉత్కంఠను పెంచేస్తోంది. దీనికి కారణం ఏమిటంటే వివేకానందరెడ్డి హత్యకేసు విచారణలో కడప ఎంపీ అవినాష్ రెడ్డితో పాటు ఆయన తండ్రి భాస్కరరెడ్డిని విచారణకు రావాలని చెప్పటమే. ఎంపీని ఇప్పటికే రెండుసార్లు సీబీఐ దర్యాప్తు చేసింది. సోమవారం విచారణకు హాజరుకావాలని ఒకేసారి తండ్రి కొడుకులకు దర్యాప్తు సంస్థ నోటీసులు జారీచేసింది.

ఎంపీనేమో హైదరాబాద్ లోని ఆఫీసులోను తండ్రినేమో కడప జైళ్ళ గెస్ట్ హౌస్ లో విచారించాలని సీబీఐ అధికారులు డిసైడ్ అయ్యారు. అయితే విచారణకు మరోతేదీని కేటాయించాలని ఎంపీ సీబీఐకి లేఖరాశారు. అధికారికంగా సీబీఐ రెస్పాన్స్ ఏమిటో తెలీలేదు. ఇక భాస్కర్ విచారణ మాత్రం సోమవారం జరుగుతుందనే అనిపిస్తోంది. వివేకా హత్యకేసులో వీళ్ళిద్దరే సూత్రదారులని సీబీఐ బలంగా అనుమానిస్తోంది. అయితే తనను కేవలం సాక్షిగా మాత్రమే విచారణకు పిలిచారని ఎంపీ చెప్పుకుంటున్నారు.

ఏదేమైనా ఎంపీ విషయాన్ని పక్కనపెట్టేస్తే ఆయన తండ్రిని సీబీఐ ఏమి చేయబోతోందనే ఉత్కంఠ పెరిగిపోతోంది. ఇద్దరి అరెస్టు ఖాయమని కాకపోతే ముందు భాస్కరరెడ్డిని అదుపులోకి తీసుకుం టుందనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటివరకు సీబీఐ విచారించిన అనేక కేసుల్లో అనుమానితులను ఇలాగే ఒకటికి రెండుమూడుసార్లు విచారణకు పిలిపించి తర్వాత అరెస్టు చేసిన ఘటనలున్నాయి. కాబట్టి ఎంపీ ఆయన తండ్రి విషయంలో కూడా ఇదే పద్ధతిని దర్యాప్తుసంస్థ అనుసరించబోతోందని సమాచారం.

అయితే వీళ్ళ అరెస్టుకు సీబీఐ దగ్గర ఎలాంటి ఆధారాలున్నాయో అర్థంకావటంలేదు. బలమైన ఆధారాలు లేకుండా ఊరికే అరెస్టంటే అది కోర్టులో నిలవదన్న విషయం అందరికీ తెలిసిందే. గూగుల్ టేకౌట్ అయినా మరోటైనా కోర్టులో పక్కాగా నిలబడాలంటే ప్రవేశపెట్టే ఆధారాలు తిరుగులేనివయ్యుండాలి. వివిధ కేసుల్లో సీబీఐ కోర్టులో ప్రవేశపెట్టిన అనేక ఆధారాలను కోర్టులు కొట్టిపారేసిన ఉదాహరణలు చాలానే ఉన్నాయి. కాబట్టి బలమైన ఆధారాలను సేకరించినపుడే సీబీఐ పెట్టే కేసులు ఛార్జిషీట్లు కోర్టులో నిలబడతాయి. లేకపోతే కక్షసాధిస్తోందనే అపవాదును సీబీఐ మోయాల్సిందే తప్పదు.

ప్రకృతిలోఆడమగ ఇద్దరూ సమానమే:జిల్లా ప్రధానన్యాయమూర్తి డా.టి.శ్రీనివాసరావు

ఖమ్మం, మార్చి 6: (నేటినిజం ప్రతినిధి): ప్రకృతిలో ఆడా మగా ఇద్దరూ సమానమేనని అయితే ఈ సమానత్వం కుటుంబం నుంచే ప్రారంభం కావాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డా. టి. శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పుట్టకోటలోని కస్తూర్బా పాఠశాలలో నిర్వహించిన మహిళా న్యాయ చైతన్య సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆడ మగ అనే భేదం చట్టపరంగా లేదని అందరూ సమానులేనని అన్నారు. విద్యార్థి దశనుంచే ప్రతి ఒక్కరూ ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని దాన్ని సాధించడానికి కృషి చేయాలని ఉద్బోధించారు. పేదరికం మనిషిని బాధ పెట్టకూడదని, ఉన్నదాంట్లో సంతృప్తి చెంది ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆయన విద్యార్థులకు పిలుపునిచ్చారు. సమాజంలో జీవించేటప్పుడు ఎవ్వరూ ఇతరుల వస్తువులను కానీ ధనాన్ని కానీ ఆశించవద్దని నిజాయితీగా నిలబడాలని పిలుపునిచ్చారు. విద్యాభ్యాస దశలో విద్యార్థులు మానసిక శారీరక ఆరోగ్యంపై దృష్టి సారించాలని అన్నారు. పిల్లలందరూ తల్లిదండ్రుల మాట విధిగా వినాలని తల్లిదండ్రులను మొదటి గురువులుగా భావించాలని అన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తి వరకట్న నిషేధ చట్టము, బ్రూణ హత్యల నిషేధ చట్టము, అవినీతి నిరోధక చట్టం తదితరాలను వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయ సేవా సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జ్ మహమ్మద్ అబ్దుల్ జావేద్ పాషా, కళాశాల ప్రిన్సిపల్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

యువత తండాలు దాటి పట్టణాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలి

-డాక్టర్ గోలి మోహన్
-ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన గోలి మోహన్

రాజన్న సిరిసిల్ల, మార్చి 6: (నేటినిజం ప్రతినిధి): : కథలాపూర్ మండల బంజార ప్రజల ఆహ్వానం మేరకు సంత్ సేవా లాల్ జయంతిని పురస్కరించుకుని ప్రజా ఆశీర్వాద సభకు సోమవారం డాక్టర్ గోలి మోహన్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగాజ్యోతి ప్రజ్వలన చేసి ప్రజా ఆశీర్వాద సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోలి మోహన్ మాట్లాడుతూ ప్రజల కోరిక మేరకు ఈసారి ఎమ్మెల్యేగా ఎన్నికల బరిలో దిగుతున్నానని, బంజారా ప్రజలు తనను ఆశీర్వదించాలని కోరారు. అలాగే తండాలలో ఉంటున్న యువత పట్టణాలకు వచ్చి ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. చదువుతో ఉన్నత ఉద్యోగాలు లభిస్తాయని, తద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని సూచించారు. తాండాలలో ఎలాంటి కష్టాలు వచ్చినా తాను తోడుగా ఉంటానని హామీ ఇచ్చారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా ఆశీర్వదిస్తే మరింత సేవలు అందిస్తానని పేర్కొన్నారు.

ఆర్టీసీ అధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

రాజన్న సిరిసిల్ల, మార్చి 6: (నేటినిజం ప్రతినిధి): : వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ బస్టాండ్ ప్రాంగణంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా వేములవాడ మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా కండక్టర్లను,పురుష ఉద్యోగుల కుటుంబసభ్యులకు ఆటలపోటీలు నిర్వహించి,సన్మానించారు. ఇందులో భాగంగానమ్మకవైన, ఉత్తమ ప్రయాణీకులైన ఆరుగురు మహిళా ప్రయాణీకులను, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మహిళా కండక్టర్ల సేవలను గుర్తిస్తూ వారిని ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా ఉద్యోగులను గౌరవించుకొని సన్మానించడం చాలా ఆనందంగా ఉందని, విశాల షాపింగ్ మాల్ యాజమాన్యం అధ్వర్యంలో ఆర్టిసి పారిశుద్ధ్య మహిళా కార్మికులకు చీరెలు, మెమోంటోలు అందించి సన్మానించడం హర్షణీయమని అన్నారు. ఈ సందర్భంగా విశాల షాపింగ్ యజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఏరియా ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ దీప్తి, డాక్టర్ అలేఖ్య, డాక్టర్ నిక్షిప్త, టిఎన్డబ్ల్యూఆర్ఈఎస్ ప్రిన్సిపాల్ విజయకుమారి, పిఆర్ఓ శ్రీనివాస్ యాదవ్, సావనపల్లి శ్రీనివాస్, అకౌంటెంట్ చంద్రమౌళి, అంజి, ఏఎంఎఫ్ రాం చందర్, ఎస్టిఐ వర్జీలాల్, ఆర్టిసి సిబ్బంది, ప్రయాణీకులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో మరింతగా రాణించాలి..

-ప్రభుత్వ డిగ్రీ కళాశాల -డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, మార్చి 6: (నేటినిజం ప్రతినిధి): అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన సమావేశానికి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. మహిళలు విద్యావంతులైనప్పుడే సమాజ అభ్యుదయం జరుగుతుందని అన్నారు. ఏ రంగంలోనైనా తామేమి తక్కువ కాదని వారు నిరూపించుకుంటున్నారన్నారు. విద్యా, వైద్యం, వ్యాపారం రాజకీయాలు, క్రీడలు, బ్యాంకింగ్, అంతరిక్షం, సైన్స్ అండ్ టెక్నాలజీ తదితర ఎన్నో రంగాలలో సమర్థవంతంగా తమ బాధ్యతలను నిర్వహిస్తున్నారన్నారు. ఒకవైపు గృహిణిగా ఇంటి బాధ్యతలు నిర్వహిస్తూనే పలు రంగాలలో రాణిస్తూ మహిళా సాధికారత దిశగా అడుగులు వేస్తున్నారన్నారు తదనంతరం కళాశాలలోని మహిళా అధ్యాపకులను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారిణి డాక్టర్ రమాదేవి, కళాశాల అధ్యాపకులు డాక్టర్ మధు రాజేష్, డాక్టర్ ఎం మల్లారెడ్డి, డాక్టర్ ఎం ప్రభాకర్, డాక్టర్ ఎన్ శ్రీనివాసులు, కె రాజేశ్, వై నారాయణ, వై నర్సయ్య, డాక్టర్ కె.వై. కరుణ, కె మధుబాబు, ఎం దీపిక, డాక్టర్ అర్జున్, రమేశ్ బాబు, ఫకీర్ బాబా, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భారతదేశంలో మార్గదర్శకంగా క్రాంప్టన్ స్టార్-రేటెడ్ ఫ్యాన్స్

హైదరాబాద్, మార్చి 6: ఎలక్ట్రిక్ ఫ్యాన్లలో భారతదేశపు మార్కెట్ లీడర్ అయిన క్రాంప్టన్ గ్రీవ్స్ కన్స్యూమర్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్, స్టార్-రేటెడ్ సీలింగ్ ఫ్యాన్‌లకు సంపూర్ణ మార్పుతో ఇంధన సామర్థ్యానికి తన నిబద్ధతను బలోపేతం చేసింది. ఈ ప్రకటనతో, కొత్త బ్యూరోఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ బి ఈ ఈ నిబంధనలకు అనుగుణంగా జనవరి 1, 2023 నుండి అమలులోకి వచ్చే దాని మొత్తం సీలింగ్ ఫ్యాన్ పరిధిని ఎనర్జీ-ఎఫీషియెంట్ స్టార్-రేటెడ్ ఫ్యాన్‌లకు మార్చడం ద్వారా కంపెనీ గణనీయమైన మార్పును తీసుకువచ్చింది. ఈరోజు ముంబైలో జరిగిన సమాచార మీడియా రౌండ్‌టేబుల్ ఈవెంట్‌లో, కంపెనీ తన ఉత్పత్తి పోర్ట్‌ఫోలియో, సాంకేతిక నైపుణ్యం, పంపిణీ వ్యూహం , ఈ భారీ పరివర్తనకు మద్దతుఇచ్చే కమ్యూనికేషన్ ప్లాన్‌ను వివరించింది. దీనితో క్రాంప్టన్ తన సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ సాధించడం, ఇంధన సామర్థ్యానికి తన నిబద్ధతను పునరుద్ఘాటించడం, ప్రతి పౌరుడికి 'స్విచ్ టు సేవ్' చేయడానికి వీలు కల్పించడం సాధికారత కల్పించడం వంటి ప్రభుత్వ దార్శనికతకు అనుగుణంగా ఉంది. మాథ్యూ జాబ్, సీఐఓ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ - క్రాంప్టన్ గ్రీవ్స్ కన్స్యూమర్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్అన్నారు, "ఎనర్జీ ఎఫీషియెంట్ ఫ్యాన్లకు ఈ మార్పు ప్రక్రియ మా సుస్థిరత ఎజెండాకు అనుగుణంగా ఉంది. మరింత శక్తి సామర్థ్యపు స్టార్ రేటెడ్ ఫ్యాన్లకు ఈ స్విచ్-ఓవర్ ముందు, మేము సజావు మరియు విజయవంతమైన పరివర్తనను నిర్ధారించడానికి విస్తృతమైన వ్యూహాన్ని రూపొందించాము. మార్కెట్ లీడర్‌గా, మేము క్రాంప్టన్ ఫ్యాన్‌లను విస్తృత ధర పరిధిలో కొనుగోలు చేయడం ద్వారా అన్ని వినియోగదారుల విభాగాలను "స్విచ్ టు సేవ్" ఎనర్జీకి ఎనేబుల్ చేయాలనుకుంటున్నాము, తద్వారా ఫ్యాన్లలో శక్తి విప్లవాన్ని తీసుకురావాలనుకుంటున్నాము.సచిన్ ఫార్టియల్, వైస్ ఫ్యాన్స్, క్రాంప్టన్ గ్రీవ్స్ కన్స్యూమర్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్. ఇంకా ఇలా అన్నారు, "ఈరోజు, శక్తి సామర్థ్యం కీలకమైన అంశంగా ఉండటంతో, వినియోగదారులకు మరింత సమాచారంతో కూడిన ఎంపికలు చేయడంలో సహాయపడే పరిష్కారాలను రూపొందించడం సంస్థగా మాకు చాలా అవసరం. స్టార్ రేటెడ్ ఫ్యాన్‌ల కొత్త శ్రేణి యాక్టివ్ పవర్ , యాక్టివ్ టెక్నాలజీతో వస్తుంది, ఇది అత్యుత్తమమైనది మాత్రమే కాకుండా అన్ని వినియోగదారుల ధరల విభాగాలలో ''పొదుపు హక్కు''ని కూడా అందిస్తుంది. 1500రూపాయల నుండి ప్రారంభమయ్యే శక్తి సామర్థ్య పరిధితో ఇది వినియోగదారుని సహజమైన ధరతో"స్విచ్ టు సేవ్"శక్తికి ప్రోత్సహిస్తుందని అన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సహాయం ..

రాజన్న సిరిసిల్ల, మార్చి 6: (నేటినిజం ప్రతినిధి): చందుర్తి మండలం బండపల్లి గ్రామానికి చెందిన దర్శనాల సత్తవ్వ క్యాన్సర్ వ్యాధి అనారోగ్యంతో బాధపడుతుండగా ఇదే గ్రామానికి చెందిన లింగంపల్లి బాబు- సత్య దంపతులు రూపాయలు ఐదు వేలు ఆర్థిక సహాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు, సత్తవ్వ నిరుపేద కావడంతో వైద్యం చేయించుకునేందుకు చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో విషయాన్ని స్థానిక యువకులు సోషల్ మీడియాలో వైరల్ చేయగా స్పందించిన బాబు 5000 ఆర్థిక సహాయం అందించారు, నిరుపేదకు ఆర్థిక సాయం అందజేసిన బాబును గ్రామస్తుల అభినందించారు, ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు కొండ లక్ష్మణ్, బింగి స్వామి, బిజెపి నాయకులు మ్యాకల మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వానం
గుంటూరు జిల్లా రచయితల సంఘం
రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత
సాహితీ కళారత్న కొణతం నాగేశ్వరరావు రచించిన
గీతరచనాదీపిక
గ్రంథవిష్కరణ సభ
తేది : 12-03-2023 ఆదివారం ఉదయం 10 గం॥లకు
వేదిక : శ్రీ కొరటాల మీటింగ్ హాలు, 2/7 బ్రాడీపేట, గుంటూరు
కార్యక్రమం
సభాధ్యక్షులు : శ్రీ సోమేపల్లి వెంకట సుబ్బయ్య
అధ్యక్షులు, గుంటూరు జిల్లా రచయితల సంఘం
గ్రంథావిష్కర్త : ప్రొ॥ గుజ్జర్లమూడి కృపాచారి
విశ్రాంతాచార్యులు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం
ఆత్మీయ అతిథులు : సరస్వతీ పుత్ర డా॥ భూసురపల్లి వెంకటేశ్వర్లు
హంస అవార్డు గ్రహీత
నటశేఖర తుర్లపాటి రాధాకృష్ణ మూర్తి
కవి, పండితులు, నాటక ప్రయోక్త
గ్రంథ స్వీకర్త : శ్రీ మేళం బాబూరావు
విశ్రాంత వైస్ ప్రిన్సిపల్, హిందూ కళాశాల, గుంటూరు
గ్రంథ సమీక్ష : శ్రీ ఎం. కృష్ణ కిశోర్ భాషాప్రవీణ
శ్రీ కె.జె. రమేష్
ఉపాధ్యక్షులు, గుంటూరు జిల్లా రచయితల సంఘం
నిర్వహణ
ఎస్.ఎం. సుభాని - నానా
ప్రధాన కార్యదర్శి కోశాధికారి

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.